11

ఏప్రిల్
2010

కవితా!

సమకాలీన కవితల కాలనాళిక



కవితా! 11

జనవరి ఫిబ్రవరి మార్చి 2010

సమకాలీన కవితల కాలనాళిక



నిర్వాహక సంపాదకులు శ్రీశ్రీ విశ్వేశ్వరరావు

సంపాదక మిత్రులు

[illegible] ఆంజనేయకుమార్

[illegible] సత్యనారాయణ [illegible]

ఈ సంచిక సంపాదకులు [illegible]

*

[illegible]

[illegible]

సాహితీమిత్రులు

విజయవాడ

28-10-26/1, [illegible], విజయవాడ

ఫోన్ 0866 2433359 సెల్ 94906 34849

kavita.viswam1@gmail.com

శ్రీశ్రీ [illegible] 94404 47859

[illegible]

శ్రీశ్రీ : సాహిత్యం

నరేష్ నున్నా - 9849009776

[illegible] శ్రీశ్రీ [illegible]

[illegible] శ్రీశ్రీ [illegible]

శ్రీశ్రీకి సాహిత్యం [illegible]

[illegible]

142 శ్రీశ్రీ వ్యాసాలు [illegible]

[illegible]



ప్రధానం కనుక, వారి విమర్శలో నిష్పాక్షికత, ఆబ్జెక్టివ్ అనుడులన లోపిస్తాయని ఒక అకడ మిక్ సూత్రీకరణ. మహా సృజనడులి అయిన చలంగారు ఎంకి పాటల్ని నెత్తిన పెట్టుకున్నా, కె.సి.డే గీతాల్ని పలవరించినా, 'గీతాంజలి' అభివర్ణితుడైన ఈశ్వరుడి అన్వేషణలో తపించినా ... ఆయనది కేవలం వ్యక్తిగత అభిరుచి. తనకు తారసిల్లిన వాటిపట్ల ఆయన వెలిబుచ్చిన స్పందనలుగానే వాటిని పరిగణించాలి. చాలా మంది సృజనాత్మక రచయితలకు ఈ విషయంలో సారుప్యం ఉంటుంది. కానీ శ్రీశ్రీ ఇందుకు మినహాయింపు. విశ్వనాథ, కృష్ణశాస్త్రి ప్రభావంలో సాహితీయాత్ర ప్రారంభమైన నాటి నుండి, సుబ్బారావు పాణిగ్రాహి, గద్దర్, ప్రభృతులను ప్రజాకవులుగా కీర్తించే చివరిదశ వరకు కూడా కవిత్వాన్ని ఎన్నడూ ఆయన 'వ్యక్తిగత అభిరుచి' ప్రమాణాల ద్వారా తూచలేదు. ఆయన 'హృదయంలో నిదురించే చెలి' కవయ్యానిజం ఆయున కవిత్వానుడులన దృష్టిని పాక్షికం చేయనూలేదు.

సెప్టెంబరు 1981లో 'మో' సంపాద కత్వంలో వచ్చిన 'దిస్ టెన్ ట్రైమ్స్' (ఆధునిక తెలుగు కవిత్వం ఆంగ్లానువాద) గ్రంథావిష్కరణ సభలో కావ్య స్వీకర్తగా ప్రసంగిస్తూ, గురజాడతోనే ఆధునిక కవిత్వం ప్రారంభం కాలేదని, చెళ్ళపిళ్ళ కవుల శతావ ధానాలు కూడా ఒక విధంగా ఆధునిక కవిత్వానికి మాతృకలేనని, వెంకట పార్వతీశ్వర కవుల గ్రంథాలనుంచి కూడా ఎంపిక చేయాల్సిందేనని అభిప్రాయపడ్డారు. (పేజి 105, శ్రీశ్రీ ఉపన్యాసాలు - విరసం ప్రచురణ). 'వెనకటి గ్రంథాలు చదవని వాడెవ్వడు ఈనాడు సరసమైన సాహిత్య రచన చెయ్యలేడు. ఇదివరకు వేయబడిన గట్టిపునాదుల మీదనే ఈనాటి సాహిత్య సౌధం నిర్మించబడుతున్నది' అని బలంగా వాదించిన శ్రీశ్రీ ఒక్కడే బహుశా ప్రాచీన, ఆధునిక సాహిత్య సారస్వాల మేలు కలయిక, పురానవ సృజనడులి అని చెప్పవచ్చు. నన్నయ ఆడంబరం, తిక్కన విస్తృతి, పోతన శబ్దలౌల్యం, పెద్దన భావచౌర్యం, వేమన సామర్థ్యం, గురజాడ వైశిష్ట్యం ... అర్థం చేసుకొని, ఇంకా కవి చౌడప్ప నుండి రాయప్రోలు, అబ్బూరి, బసవరాజు, నండూరి, విశ్వనాథ, దేవులపల్లి, కవికొండల ప్రభృతుల నుంచి, ఆరుద్ర, అనిశెట్టిల నుండి, దిగంబర కవులు, విప్లవకవుల వరకూ, ఇంకా ఫ్రెంచి, ఆంగ్ల, జర్మన్, పురానవ కవుల వరకు అనంతమైన సాహిత్యాన్ని ఔపోసన పట్టిన శ్రీశ్రీ నిష్పూచిగా, వ్యక్తిగత రాగద్వేషాలకు, పరిమితులకు లోబడి సాహిత్య వివేచన చేయలేదు (నారాయణ బాబు, ఆరుద్రాదుల విషయంలో ఆయన, వాస్తవమేమో అని తోచే, అటువంటి ఆరోపణలు ఎదుర్కొన్నారు). సాహిత్యాన్ని ఉన్నత ప్రమాణాల ప్రాతిపదికగా మాత్రం ఎంచుతారు గనుకనే, 'షేక్స్పియర్ నాటకాలు రాస్తే, శ్రీనాథుడు మహాకావ్యాలు రాశాడు. వేమన వంటి కవి ఏ భాషకైనా గర్వ కారణం' అని సాధికారంగా చెప్పగలిగారు శ్రీశ్రీ.

శ్రీశ్రీ కవిత్వాన్ని తూచే రాళ్లు తన దగ్గర లేవన్నారు చలం. కవిత్వమే కాదు, శ్రీశ్రీ సాహిత్య సమగ్రాన్ని (ఆయనలానే) నిర్మొహంగా తూచి, పునర్మూల్యాంకన చేసే రాళ్లకోసం వెదుకు లాడటమే మన కర్తవ్యం.



మహాప్రస్థానం

మరో ప్రపంచం,
మరో ప్రపంచం,
మరో ప్రపంచం పిలిచింది !
పదండి ముందుకు,
పదండి త్రోసుకు !
పోదాం, పోదాం పైపైకి !

కవిత
ఏప్రిల్
2010



మహాకవి శ్రీశ్రీకి శతజయంతి నివాళి

డాక్టర్ ఎ.బి.కె. ప్రసాద్
• 98490 09776

ప్రపంచ సాహిత్యంలో తమ కదను తొక్కించిన కాలాన్ని తమ శతాబ్దంగా భావించుకొని గుండె నిబ్బరంతో "ఈ శతాబ్దం నాది" అని సగర్వంగా దండోరా వేసిన స్రష్టలు ముగ్గురే ముగ్గురు. వారు : ఆంగ్ల సాహిత్యంలో బెర్నార్డ్ షా, జర్మన్ సాహిత్యంలో గంతర్ గ్రాస్, భారతీయ సాహిత్యంలో తెలుగువారి ప్రతినిధిగా మహాకవి శ్రీశ్రీ... అతనే ప్రాక్పశ్చిమ సాహితీ సౌరభాలను మూటగట్టుకున్న శ్రీరంగం శ్రీనివాసరావు. ఫ్రెంచి మహారచయిత వోల్తేర్ గురించి ముచ్చటించుకోడమంటే మొత్తం పద్దెనిమిదవ శతాబ్దం గురించి తవ్వుకోవడమే అవుతుందన్నాడు విక్టర్ హ్యూగో. అంతేగాదు, 1930 దాకా తెలుగు సాహిత్యం తనని నడిపించిందనీ, ఆ తరువాత నుంచీ దాన్ని నడిపించానని చాటగల్గిన ధిషణ ఉన్నవాడు ఒక్క శ్రీశ్రీయే. తెలుగునాట మహాకవి గురజాడ తరువాత, గణబద్ధ ఛందస్సులు ప్యూడలిజం నుంచి మాత్రా ఛందస్సుల, వచన కవితా రోచిస్సులతో కవితా ప్రస్థానంలో ప్రజాస్వామ్య ప్రదాయాలకు, సామాన్య మానవుడి అగచాట్లకు అద్దం పట్టి, మానవాళి శ్రేయస్సు కోసం ప్రజా భాషలో 'నిన్నటి జట్కావాలా' దాకా కవితారూపంలో అక్షర నీరాజనాలు జీవితమంతా అర్పించిన మహాకవి మన శ్రీశ్రీ. ఆంధ్ర సాహిత్యానికి, తెలుగు కవిత్వానికి ఆధునికతను అద్ది, బడుగు జీవుల సేవలో కలానికీ, రచనకూ ప్రయోజన పరత్వాన్ని అబ్బించిన వాడు శ్రీశ్రీ.

సంప్రదాయ వాద ఛాయల్లో ఎదిగిన శ్రీశ్రీ పరిణామక్రమంలో జానపద గీతికను జాతికి అసలైన జీవనాళికగా గుర్తించాడు. పల్లెపదం గుండెనీ, ప్రబంధం మెదడునీ కదిలిస్తుంది. మెదడు హృదయం కలిసిపోయే గుణం మహాకావ్యానికి లక్షణమన్నాడు. తెలుగు తల్లిని అందాల నిండు జాబిల్లిగా, ఆనందాల కల్పవల్లిగా భావించాడు. తెలుగునేల సంకెళ్ళులేని భూమిగా వర్ధిల్లాలని ఆశించి, దానిని "సంతోష చంద్ర శాల"గా మార్చుకొమ్మన్నాడు. తెలుగు కోటను కొట్లాటలకూ, కాట్లాటలకూ కేంద్రం కాకుండా గులాబీతోటగా తీర్చి దిద్దుకోమన్నాడు. ఇక నుంచి "మూడు కోట్ల తెలుగు నోళ్లు పాడిందే పాట" అంటూ అందుకుని "ఏడు కోట్ల తెలుగు వాళ్ళు పాడండీపూట" అని సంపదను నిబద్ధాక్షరంగా అందించాడు. సాహిత్య ప్రజా తంత్ర సంప్రదాయానికి అకుంఠితమైన ప్రయోగాలతో శిఖరాయమానంగా నిలిచాడు. విప్లవం ముందు మనుషుల మనస్సుల్లో ప్రారంభమవుతుంది. మన ప్రపంచానికి బాహ్య రూపం భాష, భాషా విప్లవమే భావ విప్లవం అన్నాడు. జీవితానికీ, సాహిత్యానికీ ఉండవలసిన విడదీయరాని, విడదీయలేని అనుబంధాన్ని చాటి చెప్పాడు. విడదీస్తే సాహిత్య ప్రయోజనానికీ ప్రజా శ్రేయస్సుకూ వాటిల్లగల ప్రమాదం గురించీ ముందస్తుగా హెచ్చరించినవాడు శ్రీశ్రీ.

శ్రీశ్రీనీ, కలకలం సృష్టించగల అతని కలంలోని బలాన్నీ, కవితా లక్ష్యాన్నీ ఒక్క మాటలో అర్థం చేసుకోవా లంటే - 'కవి' అన్న వాడికి ఆ రెండక్షరాలకు, అతనిచ్చిన నిర్వచనం చాలు : "కష్టజీవి"కి మొదలూ, చివరా కోపుకాసి కాపు కాసిన వాడే 'కవి' అన్నాడు. ప్రపంచ సాహిత్య చరిత్రలో సమకాలీన ధనిక వర్గ సమాజంలో అంతర్భాగంగా జీవిస్తున్న రచయితలకు, కవులకు ఉన్న బలహీనతలను ఆయన కప్పి పుచ్చలేదు. నూరు సుగుణాలలోని ఒక దోషానికి, నూరు దోషాలలోని ఒక్కవిత



మరణానికి ప్రాణం పోస్తాం,
స్వర్గానికి నిచ్చెన వేస్తాం
ప్రపంచమును పరిహసిస్తాం
భవిష్యమును పరిపాలిస్తాం

అద్వైతము



సుగుణానికి ఉన్న తేడాను కనిపెట్టినవాడు శ్రీశ్రీ. పైపెచ్చు మనిషిని మనిషి దోచుకు తినే పెట్టుబడిదారీ సమాజపు అవలక్షణాలలో కొన్ని తనకూ సంక్రమించాయని ఆయన బాహాటంగా చెప్పుకున్నాడే గానీ కొందరు కుహనా రచయితల్లో 'కడుపులో కత్తెర, నోట్లో చక్కెర' పెట్టుకుని మాట్లాడలేదు. అందుకు నిదర్శనం శ్రీశ్రీ ఆత్మకథాత్మక ఆత్మ కథ "అనంతం". నిర్మొహమాటంగా సాగిన ఈ గొప్ప రచనను ఫ్రాంక్ హారిస్ రచన "ఒప్పు కోళ్ల (కన్ఫెషన్స్‌తో) పోల్చవచ్చు. శ్రీశ్రీ తన జీవిత కాలంలో ఎన్నడూ తప్పుల తడకను ఒప్పుల కుప్పగా చూపనూ లేదు. ప్రభోదించనూ లేదు. కాని శ్రీశ్రీ శత జయంతి సందర్భంగా కొందరు రచయితలు తమ కళ్ళలోని కడగండ్లకు అద్దం పట్టిన ఆయనలోని ఆవేదనాశక్తిని కానలేక వ్యక్తిగత విమర్శలకు దిగారు. సాహితీలోకంలోని ఈ గురివింద గింజల దిగజారుడుతనం, ఆకాశమార్గంలో ప్రయాణించేవాడు పై నుంచి పుక్కిలించి కిందికి ఊసి, తనను జనం ఏమను కుంటున్నారో చూడాలని తహతహలాడి నట్టుంది. ఈ బాపతు వాళ్లంతా దారితప్పిన దానయ్యలు, యయాతి సంతతి.

శ్రీశ్రీ తన తొలి కవితా సంపుటికి పెట్టుకున్న పేరు "మహాప్రస్థానం", ఆ తరువాత ఖడ్గసృష్టి, మరో ప్రస్థానం వెలువడ్డాయి. సర్వసాధారణంగా "మహాప్రస్థానం" అనగానే కొందరికి శవయాత్ర గుర్తుకొస్తుంది. కాని శ్రీశ్రీ తన సంపుటికి నామకరణం చేయడంలో భారతంలోని మహాప్రస్థాన, స్వర్గారోహణ పర్వాల నుంచి ఉత్తేజం పొంది, తన "మహాప్రస్థానాన్ని" ప్రజలకు విశిష్ట మోక్షపథంగా మార్చాడు. బాధల నుంచి ప్రజల విముక్తి సాధించడానికీ, శుభాలూ, సుఖాలూ చూపగల మార్గానికీ జరిపే యాత్రను "మహాప్రస్తానం" అన్నాడు. ఈ దారిని ఆయన దర్శించి, తాను ఆశిస్తున్న ఆవాహనం చేస్తున్న సామ్యవాద, సమ సమాజ వ్యవస్థకు వర్తింప జేసుకుని, మనిషిని మనిషి దోచుకునే దోపిడీ వ్యవస్థనుంచి బయట పడేందుకు ప్రజలు జరపాల్సిన ప్రస్థానాన్ని "మహాప్రస్థానం"గా, మహాయాత్రగా, లాంగ్‌మార్చ్‌గా, అదే సుదీర్ఘ యాత్రగా మార్చాడు. అర్జునుడు విశ్వరూపాన్ని ఎలా దర్శించాడు? తన "కంటి వెలుగుల" వల్లనే. అలాగే మానవ సమాజం కూడా ఉత్తమ సమాజాన్ని నిర్మించుకోవడం ఆ "కళ్ల వెలుగు" తోనే సుసాధ్యం అన్నాడు. అదే సోషలిజం లేదా కమ్యూనిజం అన్నాడు శ్రీశ్రీ! అందుకే అంత వరకూ "అలజడి మా జీవితం ఆందోళన మా ఊపిరి తిరుగుబాటు మా వేదాంతం" అన్న శ్రీశ్రీ, "దేశమంటే మట్టికాదోయ్, దేశమంటే మనుషులోయ్" అన్న మహాకవి గురజాడను 'గురు' జాడగా మార్చుకుని తన శాశ్వతమైన చిరునామాగా "మనుష్యుడే నా సంగీతం, మానవుడే నా సందేశం" అనీ ముక్తాయింపు విసిరాడు. ప్రజలంతా ఒకటని చాటి, వ్యష్టికి బహువచనం సమిష్టిగా ప్రకటించి జగజ్జనుల మధ్య కృత్రిమ సరిహద్దులు చెరిపేశాడు. ఆ వూపులోనే శ్రీశ్రీ నలభై ఏళ్ల నాడే తెలంగాణా జెండా అఖిలాంధ్ర పతాకం కావాలని ఆశించి, అది ఐక్యరాజ్య సమితిలో విశాలాంధ్ర పతాకంగా ఎగిరితే, తానెగిరి గంతేసి శాల్యూట్ చేస్తానన్నాడు. ఇంతమంది తెలుగువాళ్లంతా ఐకమత్యంగా ఉంటే యావద్భారతంలోనూ, ప్రపంచంలోనూ రాణిస్తామని గుర్తు చేశాడు. "దేశ చరిత్రలు" ద్వారా చరిత్ర పాఠాలు చెప్పాడు. చరిత్రలో జరిగిన అన్యాయాలు, బక్క జీవుల పట్ల సాగిన మోసాలను కవితా పరంగా విప్పి చూపాడు. కుల, మత, వర్గ వ్యత్యాసాలను చీల్చి చెండాడాడు. చరిత్రలో మరుగున పడిన కథల్ని తవ్వి తీశాడు.

సమ్మె కట్టిన కూలీల,
సమ్మె కట్టిన కూలీల భార్యల, బిడ్డల
ఆకలి చీకటి చిచ్చుల
హాహాకారం! ఆర్తారావం!
ఒక లక్ష నక్షత్రాల మాటలు,
ఒక కోటి జలపాతాల పాటలు,
శతకోటి సముద్ర తరంగాల మ్రోతలు
విన్నానమ్మా, విన్నా, నెన్నో విన్నాను
'కవితా! ఓ కవితా!'





తన సత్యాన్వేషణలో సామాన్యుల జీవనానికి, సాహసాలకు, బాధలకూ కవితా రూపంలో ప్రజా ప్రతినిధిగా మారి సుఖ దుఃఖాలకు పల్లవీ, అనుపల్లవీ తానే అయ్యాడు. ఇలా చూపడం కోసం శ్రీశ్రీ ఆశ్రయించింది ఒక్క ప్రక్రియను కాదు, అనేక ప్రక్రియలతో చాకిరీ చేయించు కున్నాడు. తాను గద్య పద్య చింతామణి అయి, హాస్యాన్నీ, చతురతను మేళవించి కవితలు, కార్టూన్ కవితలు, కథలు, అనువాద కథలు అల్లాడు; హాస్యానికి పసందైన బాణాలుగా ప్రాస క్రీడలాడాడు.'లిమరిక్కులు' చమక్కులు చూపాడు. టెలిస్కోపిక్ పదగతులు నడిపాడు. సిరి సిరి మువ్వలు వినిపించాడు. సినీ పాటలతో ప్రజా బాహుళ్య ప్రయోజనాలకు వకాల్తా పడ్డాడు. వేసాల మారి లోకంలోని మోసాలకు మూర్ఛిల్లి ప్రజల తరపున ప్రజా న్యాయవాదిగా నిలబడి కావ్యపాత్రలో ఒక జీసస్‌గా, ఒక బుద్ధునిగా, ఒక గాంధీగా, ఒక మార్క్స్‌గా మారాడు. తెలుగు యువతను కవ్వించి శాసించాడు. పుట్టుకతో వృద్ధులు కావద్దన్నాడు; పేర్లకీపకీర్లకీ పుకార్లకీ నిబద్ధులు కావద్దన్నాడు, నేటి నిజాన్ని చూడలేని కీటక సన్యాసులుగా అసలే బతకొద్దన్నాడు; నేటి యుగానికీ, రాబోయే యుగాలకు దూతలుగా, బానిస పంధాలను అనుకరించని, అన్యాయాలు సహించని యువకులుగా, నవ జీవన బృందావన నిర్మాతలుగా మెలగాలని నిండు మనస్సుతో ఆహ్వానించి ఆఉరక్షతలు చల్లాడు. ఇందుకోసం నవీన విశ్వవిద్యాలయాల్లో 'పురాణ కవిత్వాలు' చాలించి మనిషికి పుష్టినీ, తుష్టినీ, జీవశక్తినీ యిచ్చే రచనలకు విలువ కల్పించ మన్నాడు. ఆలోచించడమంటే ఊకని దంచడం కాదు, ఊహల్ని పెంచుకోవడం అన్నాడు. ఇదే ఆదర్శాన్ని కవితా ప్రయోజనంగా నిర్ధారిస్తూ కవిత లక్ష్యాన్ని కూడా నిర్వచించి వెళ్లాడు: "సమకాలిక జీవితమే సత్కవితా వస్తువు. పలాయనం పనికి రాదు. భగవంతుడు వైపైనా నిలబడాలి తను చూసే నిజం కోసమేమైనా అతడే ద్రష్ట, అతడే స్రష్ట, బ్రతుక్కతడే పరాకాష్ట" అని ప్రకటించాడు. ఆర్డర్లు తీసుకోవడం తెలియని వాడు ఆర్డర్లు ఇవ్వలేడన్న సత్యాన్ని పలికాడు. చేసిన పొరపాట్లను గుర్తించి, తెలుసుకున్న వాడికి వాటికి కారణం తెలిసి ఉంటుందని చెబుతూ మనిషి నైతిక విలువ ఏ స్థాయిలో ఉండాలో పాఠం చెప్పాడు: "కాలు జారడం నేరం కాదు. కారణం తెలుసుకోలేకపోవడం ఘోరం. పొరపాట్లని గుర్తిస్తే అవి మనకి చాకిరీ చేస్తాయి. రచనకు పరమావధి ఫలాయనం కాదు ప్రజాక్షేమం ప్రగతి ఉలం కాదు, సంఘర్షణ దాని మూలం. పరిణామం దాని నైజం, పరాజయం లేనిది ప్రాణం" అన్న నైతిక విలువలతో కూడిన ఆశావాదాన్ని సర్వత్రా ఆవాహనం చేశాడు శ్రీశ్రీ.

చివరికి చలనచిత్రాలలో "దేవత"ల నోట కూడా "మానవుడే సర్వశక్తిధాముడ"నీ, మానవుడే "సృష్టికి అలంకారమ"నీ చాటేదాకా నిద్రపోని వాడు మహాకవి శ్రీశ్రీ. "సమాజమంతా సమానమైతే నాడేజాతికి నవజీవనం" అని సామ్యవాద సూత్రాన్ని వెండితెర ద్వారా ప్రచలితం చేశాడు. మద్రాసులో గడిపినన్నాళ్లూ మద్రాసులోని ఫ్రెంచి ఫిలిం సొసైటీ శాశ్వత సభ్యుడుగా ఉన్నాడు శ్రీశ్రీ. ఆ రోజుల్లో ఫ్రెంచి భాష బాగా వచ్చిన తెలుగు పెద్దలు ఇద్దరే ఇద్దరు....వారిలో ఒకరు శ్రీశ్రీకాగా, మరొకరు ఆచార్య రోణంకి అప్పలస్వామి. అనేక మంది ఫ్రెంచి కవుల రచనలతో శ్రీశ్రీకి విడదీయరాని అనుపమానమైన అను బంధం ఎన్నో ఆంగ్ల కవితలతోపాటు ఫ్రెంచి కవితలు కూడా శ్రీశ్రీ అనువదించాడు. ఆయన అనువాద రచనలన్నీ ఆయా భాషా మాతృకలను తలదన్నుతూ అందమైన మెరుపులూ, విరుపులూ చూపించిన




"లేదు నేస్తం! లేదు
నీ ప్రాభవం మమ్మల్ని వదలలేదు!
నిరుత్సాహాన్ని జయించడం
నీవల్లనే నేర్చుకుంటున్నాము!

ప్రతికూల శక్తుల బలం మాకు తెలుసు !
భయం లేదులే అయినప్పటికీ!
నీ సాహసం ఒక ఉదాహరణ!
నీ జీవితమే ఒరవడి!
నిన్న వదిలిన పోరాటం
నేడు అందుకొనక తప్పదు.


•

అంకితం
కొంపెల్ల జనార్ధనరావుకోసం




వేనంటే అతిశయోక్తి కాదు.

మహాకవి శ్రీశ్రీ ఆశపోతు కాదు, ఆశావాదీ, హేతువాదీ. కనుకనే మానవుని పరిణామాన్నీ, జీవరాశి పరిణామ వాదాన్నీ, చలనశీలమైన ప్రకృతిలోని అనుక్షణ సౌందర్యాన్నీ అర్థం చేసుకుని ఆస్వాదించిన శ్రీశ్రీ, ఆకలి కడుపులోని చీకటి బతుకులను కూడా కళ్లారా చూడగలిగాడు. అభ్యుదయ కవితా ఉద్యమంతో అడుగులు తడబడకుండా ముందడుగు వేస్తూ సమర శీల ప్రజాస్వామ్య రూపాలు తొడిగిన శ్రీశ్రీ కవితా ప్రస్థానం, దేశ రాజకీయ, సామాజిక ఆర్థిక పరిణామాలను ఆ క్రమంలోనే బేరీజు వేసుకుని, మరింతగా ప్రజాహితమైన నవీన ధోరణులను ఆహ్వానించి ముందుకు సాగి, అనంతర దిగంబర, విప్లవ కవితా, దళిత, స్త్రీవాద ఛాయలను కూడా నిష్కల్మషమైన మనస్సుతో ఆహ్వానించి అక్కున చేర్చుకుంది. సమాజంలో అసమానతలను, అకృత్యాలను సహించని శ్రీశ్రీ స్త్రీ - పురుషుల మధ్య కూడా వాటి ఉనికిని దుర్భరంగానే భావించాడు. 'మగా - ఆడా' గా రెండుగా చీలిన ఈ మానవ నైజాన్ని శ్రీశ్రీ వినూత్న కోణం నుంచి దర్శించి ఆ ఇరువురి దుస్థితికి అసలు కారణాన్ని కనిపెట్టిన ద్రష్ట : "ఒకటి మగ/ఆలోచించడం అంటే దానికసహ్యం / రెండవది ఆడ / ఆలోచించనిచ్చారు కాదు ఆడజాతిని / కాని రెండు జాతుల్లోను ఒక సమాన ధర్మం ఉంది/అదే భయం/రోగం అంటే భయం/వార్ధక్యం అంటే భయం/ఒంటరితనం అంటే బయం/ఓటమిఅంటే భయం/ముఖ్యంగా పొరుగు వాడంటే బయం/ అందుకే మానవుడు తాను "బుద్ధిమంతు"డను అనుకుని తనకు తానే సర్టిఫికెట్ ఇచ్చుకునేవాడు"అని వ్యంగ్యంగా బుద్ధి చెప్పాడు. స్త్రీ మూర్తి అంటే మనల్ని కనిపెంచిన ధరిత్రి, "వేదనలో మన జనయిత్రి" అన్నాడు. దుఃఖితమతులైన స్త్రీలను "అఘని శ్రేణిగానూ, చెప్పుకోలేని బాధలను గాథలను నీలకంఠుడిలా భరించే స్త్రీలను ''గరళద్రోణి'' గానూ పేర్కొన్నాడు. వర్గరహిత సమాజాన్ని శ్రీశ్రీ స్త్రీ పురుష అభ్యున్నతికి లింగ వివక్షను వ్యతిరేకించి స్త్రీల కన్నీటి గాథలకు అనుశ్రుతిగా తన పేరును కూడా "స్త్రీ స్త్రీ''గా మార్చుకున్నాడు. మానవజాతి మనుగడలో సృష్టికి, స్థితికి శృంగారం అరాచక శృంగారానికి (ప్రొగ్రెసివ్ సెక్స్, రిగ్రెసివ్ సెక్స్) అర్థాన్ని నిర్వచించిన మహాకవి కూడా శ్రీశ్రీయే. దారిద్ర్యంలో కడుపు దహించుకుపోయే దుర్భర స్థితిలో సమాజం దారి తప్పించిన స్త్రీ అనుభవించక తప్పని రాక్షస రతిలో, ఆ అర్థ నిమీలిత నేత్రాలలో కనిపించే ఆ భయంకర బాధల దృశ్యానికి, నిర్మల శృంగారానికి తేడా చూపించాడు. తనకంటూ ఏమీ మిగుల్చుకోకుండా సమస్త సంపదలనూ, బాలబాలికలకు వదిలేస్తూ "మీదే మీదే సమస్త విశ్వం/ మీరే లోకపు భాగ్య విధాతలు'' అంటూ ఈ భూమాత బిడ్డలందరినీ ఆశీర్వదిస్తూ ఓ "విల్లు'' రాసి పోయాడు శ్రీశ్రీ. అజ్ఞానమనేది నేరమని చాటి, దానికి శిక్ష నిర్బంధ విద్యావిధానమేనన్నాడు. బతుకును ఒక కలగా భావించవద్దన్నాడు. "కలకానిదీ, విలువైనదీ" ఈ బతుకని చెప్పి దాన్ని కాస్తా కన్నీటి ధారలలోనే బలి చేసుకోవద్దని బోధించి బతుకుపైన ఆశ నిలిపాడు. పనిని, శ్రమను గౌరవించాడు. సమాజ సంక్షేమం సామాజికుల శ్రమలో ఉందన్నాడు. పనిలేని బతుకు పొట్టి చీడనీ, ఒక 'బీడు'నీ మనకు కూడు పెట్టని పీడ అనీ, పనీ, శ్రమా జీవితాన్ని అమృతమయం చేస్తాయనీ బోధించి, ఈ కనీసావసరాన్ని తీర్చడం ప్రభుత్వాల బాధ్యత అనీ చాటాడు. ఆశయాలు మంచివేకాని, అన్ని ఆశయాలూ మంచివి కావని చెబుతూనే ఆశయాలు సంఘర్షించే వేళ ఆయుధ



పాలికాపు నుదుటి చెమట,
కూలివాని గుండె చెరువు,
బిచ్చగాని కడుపు కరువు
మాయంటావూ?
తుపానులూ, భూకంపం
తిరుగుబాట్లు సంగ్రామం
మాయంటావ్? ఏయ్
ఏమంటావ్
మాయంటావూ? అంతా
మిధ్యంటావూ?

మిధ్యావాది






తటస్థంగా వుండదని ప్రకటించాడు. అన్ని వృత్తులనూ, వాటి చిహ్నాలుగా గౌరవించాడు. ఆదునిక సమాజానికి ఆర్థికమే కీలకమని తెలుసుకోమన్నాడు; అసలు సమస్యల జోలికి పోనివాళ్ళు స్వప్రయోజనాలకు భేషైన రంగులు పులుముతారని జోస్యం చెప్పాడు. నిజమైన ప్రజా ఉద్యమాలకు తాత్కాలిక పరాజయాలు తప్పవని కూడా గుర్తించాడు. ఆఖరి సంగ్రామంలో కళ్ళ వెలుగై వచ్చేది మాత్రం అరుణారుణ మహోదయమేనని చాటాడు. కనిపించని మాధవుణ్ణి కాన్కలిచ్చి కొలవద్దన్నాడు. కనిపించే మానవుణ్ణి కాలరాయాలని తలవొద్దన్నాడు. ఇంతటి విశ్లేషణా శక్తి, సమస్యల అధ్యయనాశక్తి ఉన్న మహాకవి శ్రీశ్రీ యువతరాన్ని ఎంతగా కదిపి కుదిపాడండే - ప్రజల భాషలో గేయ రచనల్లో గాని, వచనంలోగానీ చివరికి పత్రికా ఉర్శికలలోగానీ వాటి నిత్యప్రయోగాలలో గానీ సంపాదకీయాలలోగానీ, వ్యాసాలలో గానీ, ఉపన్యాసాలలోగానీ ఈరోజుకీ శ్రీశ్రీ పదప్రయోగ ప్రభావాల నుంచి అతని అనంతర కవులూ, రచయితలూ తప్పించుకోలేక పోతున్నారు. అలా అందరిని శ్రీశ్రీ చక్రబంధం చేశాడు. అతని "చతురస్రం" నాటిక మానవ జీవితాన్ని పునర్నవం చేసేందుకు ఉద్దేశించి ఒక ఆశాగీతిక, ఆదర్శ పీఠిక. అది 1999 సంవత్సరం, సమయం డిసెంబర్ 31 అర్థరాత్రి, ఐక్యరాజ్య సమితి సమావేశమై నూతన శతాబ్ది 2000 నుంచీ నేటి 30 ఏళ్ళ యువకులు మాత్రం వయస్సు మళ్లకుండా అలాగే ఉంటూ, వయస్సు మళ్లిన వారంతా కూడా 30 ఏళ్ల యువలకులుగా మారేటట్టుగా "అమృతం" పంచిపెట్టమన్నట్టు ఓ తీర్మానం చేస్తుంది. ఇది శ్రీశ్రీ మానవులపైన, అతని శాస్త్ర విజ్ఞానం పైన నిలుపుకున్న మహత్తర ఆత్మవిశ్వాసానికి పరాకాష్ఠ, యుద్ధాలను నిరసించిన శ్రీశ్రీ సదా శాంతి పతాకాన్ని ఎగురవేస్తూనే వర్గ సమాజంలోని వైరుధ్యాల వల్ల పుట్టుకొచ్చే నిరంతర ఘర్షణల పట్ల అప్రమత్తులై ఉండాల్సిన బాధ్యత గురించి కూడా ప్రగతిఉల పౌరులను అప్రమత్తుల్ని చేశాడు. ఈసారి యుద్ధం వస్తే దేవుడున్నట్టేనని వ్యంగ్యంగా చెబుతూనే, యుద్ధం రాకపోతే మానవుడే దేవుడవుతాడని భరోసా యిచ్చాడు. ఒక గేయాను వాదంలో..... భూమి నుండి మానవజాతి తుడిచిపెట్టుకు పోయిన తరువాత అంతవరకూ గతంలో మానవుడి ఉనికి ఎలా ఉండేదో ముఖ్యంగా అధికార స్థానాల్లో ఉన్నవారి పోకడ ఎలా ఉండేదో వ్యంగ్యంగా ఒక రచనలో యిలా చురకలు వేశాడు :

"మానవుడికి రెండు చెవులుండేవి కాని
ఏదీ వినిపించుకొనేవాడు కాదు
ఎప్పుడైనా వింటే
వాగ్దానాలూ
వీటి విలువను గూర్చిన అంచనాలూ
అభినందనాలూ
విశేషించి, కృతజ్ఞతా ప్రకటనలూ -
ఇవే వినేవాడు
మరికొందరుండేవారు
విజ్ఞానులు, పైగంబరులు
కాని వీరు అల్ప సంఖ్యాకులు వీళ్లని పెందరాళే పంపించి వేసేవాళ్లు సిలువ వేసి షూట్ చేసి విషం ఇచ్చీ అయితే, వారిని గురించి తెలుసుకోవడానికి ఏమీ మిగలలేదు!"

ఈ ప్రజాపక్షపాతమే, ఈ దార్శనిక దృష్టే ఈ నిశిత పరిఉలనే, వ్యంగ్య వైభవంతో చేసిన ఈ హెచ్చరికే మహాకవి శ్రీశ్రీని మన మధ్య చింతనలో జనతా తాత్వికునిగా, భావనలో ఆదర్శమూర్తిగా, సాధనలో త్రికాలజ్ఞునిగా, ఆచరణలో నమ్మదగిన దిక్సూచిగా, అనుభవంలో యోగిగా, అనుభూతిలో



హరోం! హరోం హర!
హర! హర! హర! హర!
హరోం హరా! అని కదలండి...
త్రాచులవలెనూ
రేచులవలెనూ
ధనంజయునిలా సాగండి!
కనబడలేదా మరో ప్రపంచపు
అగ్నికిరీటపు ధగధగలు
ఎర్రబావుటా నిగనిగలు,
హోమజ్వాలల భుగభుగలు


మహా ప్రస్థానం




వనివాడ్ంగా,
ఆఖరి క్షణం దాకా
అయిదారేడుల పాపగా, ఓ
పూవుగా, ఓ పరమాత్మగా
నిలబెట్టి ఈ శత జయంతిని జరుపుకునేట్టు మనల్ని పురిగొల్పింది. నిన్న, ఇవాళ, రేపూ, ఆపైనా, ఒక్క మాటలో ఈ లోకం ఉన్నంత వరకూ ఊగిసలాడే మన ఆలోచనల్ని దఫదఫాలుగా కమ్ముకొచ్చే మబ్బు తెరలు తొలగిపోయే దాకా ఎప్పటికప్పుడు యువకులకూ యువకవులకూ, ఒక్క ముక్కలో యావత్తు ప్రజానీకానికీ ఆదర్శం ఏది కావాలో చెప్పాడు శ్రీశ్రీ. భవిష్యత్తు మీదనే సదా నిఘా వేస్తూ వచ్చిన శ్రీశ్రీ ఇవాల్టికంటే రేపు సుందరంగా ఉంటుందని ఆత్మ విశ్వాసంతో ప్రకటించిన ఆశావాది. ఎద్దుకు బుద్ధి లేకపోతే మనిషికైనా ఉండొద్దా అని చీవాట్లు పెట్టిన సాహసి. అందుకే, శ్రీశ్రీ కవితాపరంగా చెప్పేది ఆదేశమైనా, సందేశమైనా శిరసావహించే ఘడియ ఇంతకు ముందు రాకపోయినా, ఈవేళ, రేపు విధిగా శిరమొగ్గి వినేవేళ రానేవచ్చింది. తెలుగు సాహిత్యాకాశంలో శ్రీశ్రీ ఒక ఉదయం, ఒక మహోదయం, అతనొక ఉద్యమం, మహోద్యమం, ఒక తేజం, ఒక ఉత్తేజం, అభ్యుదయ, సమరఢుల భావోద్దీపన కలిగించిన ఒక గిరిశిఖరం. అతనొక ప్రభాతభేరి, సమాజ వ్యతిరేక శక్తులకు, ప్రజావ్యతిరేక శక్తులకు అతనొక సింహస్వప్నం. అందుకే "కదిలేదీ కదిలించేదీ / మారేదీ మార్పించేదీ / పాడేదీ / మును ముందుకు సాగించేదీ/ పెనునిద్దుర వదిలించేదీ / పరిపూర్ణపు బతుకిచ్చేదీ" ఏదో తెలుసుకుని, దాన్ని పట్టుకొని ముందుకు సాగి పొమ్మన్నాడు. యువత చైతన్యవంతం కావాలన్నాడు, యువ రచయితలు కలాలను హలాలు చేసుకోమన్నాడు. జనబాహుళ్యం మనస్సులను మలిచే రసాయన ప్రక్రియకు చేదోడు కమ్మన్నాడు. అందుకోసం, రేపటిమీద ఆశతో నిఘా వేసి శతకోటి స్టెతస్కోపులు, అనంతకోటి బయస్కోపులుగా ముందుకు దూసుకుపొమ్మన్నాడు. ఆశలను, ఆశయాలను, అమ్మకాల, కొనుగోళ్ళ సంతకు చేర్చి వాణిజ్య సరుకుగా తార్చే ధనికవర్గ సమాజానికి "లాభలబ్ది" మాత్రమే లక్ష్యం గనుక నిరంతరం పోరుబాటే చివరకు ప్రజలను గమ్యానికి చేరు స్తుందన్న ఆశతో, ఆఖరి శ్వాసతో సందేశించిన వాడు మహాకవి శ్రీరంగం శ్రీనివాసరావు. ఎప్పుడు, ఎవడు, ఎటువైపు దూకుతాడో కనిపెట్టి ఉండడానికి భావాల సరిహద్దుల వద్ద కాపలా కాయమన్నాడు. అభిప్రాయాల కోసం బాధలు లక్ష్యపెట్టని వాళ్లను తనతో చేతులు కలప మన్నాడు, అభిప్రాయాలు మార్చుకుని సుఖాలు కామించేవాళ్లు కానులతో తూగుతున్న కామందులకు దాసులై మగ్గిపొమ్మన్నాడు. మంచి - చెడుల పూర్ణకుంభమైన ఈ మానవుడిలోని సర్వ గుణాలను అనితరసాధ్యమైన దృష్టితో పరిఢ లించి తన రచనలలో జల్లెడ పట్టినవాడు శ్రీశ్రీ. అందుకే అతని చిరదీక్షా తపస్సు ఫలించాలని మనం కోరుకుంటున్నాం. అతని గీతాలు ప్రజల గుండెల్లో గూడుకట్టు కున్నాయి. అవి కోటానుకోట్ల జాతిజనులు పాడుకునే మంత్రాలుగా మోగుతున్నాయి. అతను కలలు గన్న ఆశయాలు కేవలం స్వప్నాలుగా మిగిలిపోకుండా లోకానికి మరింత దగ్గరగా దూసుకు వస్తున్నాయి. అతని ఆదర్శాలు సోదరు లంతా పంచుకునే వెలుగుల రవ్వలుగా మువ్వల గంటలగా మ్రోగుతూ ఇంకా మొద్దునిదర వీడని మనకు మరోసారి మేలు కొలుపులు పాడు తున్నాయి.

- - - - -

బలవంతులు దుర్బల జాతిని
బానిసలను కావించారు;
నరహంతలు ధరాధిపతులై
చరిత్రమున ప్రసిద్ధి కెక్కిరి.
రణరంగం కానిచోటు భూ
స్థలమంతా వెదకిన దొరకదు;
గతమంతా తడిసె రక్తమున,
కాకుంటే కన్నీళులతో.
చల్లారిన సంసారాలూ,
మరణించిన జన సందోహం,
అసహాయుల హాహాకారం
చరిత్రలో మూలుగుతున్నవి.
వైషమ్యం, స్వార్థపరత్వం,
కౌటిల్యం, ఈర్ష్యలు, స్పర్ధలు
మాయలతో మారుపేర్లతో
చరిత్ర గతి నిరూపించినవి



....
చారిత్రక విభాత సంధ్యల
మానవకథ వికాసమెట్టిది?
ఏ దేశం ఏ కాలంలో
సాధించిన దేపరమార్థం?
ఏ శిల్పం? ఏ సాహిత్యం?
ఏ శాస్త్రం? ఏ గాంధర్వం?
ఏ వెల్గుల కీ ప్రస్థానం?
•
దేశ చరిత్రలు





శ్రీశ్రీ - స్వర్గ భైరవం

'మో' • 93467 36726

'అదివో అల్లదివో శ్రీహరి వాసము' అనో 'కనుగొంటినీ' అనో 'తారక మంత్రము కోరిన దొరికెను - ధన్యుడనైతిని ఓరన్నా' అనో 'ఇదిగో భద్రాద్రీ గౌతమి అదిగో చూడండీ' అనో ఇంకా చాలా చాలా ఎలానో వివశుడై కవి పాడుకున్నపుడు అతని వివశత్వాన్నీ సాహిత్య సంగీత పారవశ్యాల్నీ మనం సందేహించటం, ఆ ప్రక్రియల్లో హేతువాదాన్ని ప్రవేశపెట్టటం సౌహృదలక్షణం కాని మాట నిజమే కాని శ్రీశ్రీ లాంటి విప్లవ కవి ఫ్రాన్సిస్ తామ్సన్ (1859-1907) రచించిన 181 పంక్తుల పిండారిక్ ఓడ్ లాంటి 'ది హౌండ్ ఆఫ్ హెవెన్'ని ఏక బిగిన తెలుగులోకి అనువాదం చేయటం ఆశ్చర్యకరమైన వార్తే! 'స్వర్గ భైరవం' అనువాదం 1982 ఫిబ్రవరి 'భారతి' మాసపత్రికలో ప్రచురితం. శ్రీశ్రీ జీవిత చరమాంకంలో. ఈ అనువాద రచనకు ప్రేరణ డా. గూటాల కృష్ణమూర్తి గారిది. నేను విన్నదాన్ని బట్టి డా. గూటాల పట్టుబట్టి శ్రీశ్రీని కూచోబెట్టి (లండన్‌లో రెండు మాసాలు తన అతిథిగా ఉన్నపుడు) ఈ రచన చేయించారు.ఇతర విశేషాలు కర్ణాకర్ణిగా విన్నవేగాని నేనేమీ వివరంగా చెప్పలేను.

ప్రస్తుతం ఈ చిరు వ్యాసంలో ఈ ఒక్క కవిత్వ అనువాద సరళిని మాత్రమే పరిశీలించ దలచాను. వాస్తవానికి చాలా ప్రక్రియల్లోలాగానే ఆధునికాంధ్ర కవిత్వానికి శ్రీశ్రీ నిజమైన ఆద్యుడు. అనువాద శైలిలోనూ శ్రీశ్రీది అందె తిరిగిన చెయ్యి అనటం కేవలం అరిగిపోయిన పదబంధమే. ఈ అనువాదాలు కూడ అసంఖ్యాకాలు. ఎప్పుడో 1954లోనే డిలన్ తామస్ కవిత Especially When the October Wind ని 'మరీ ముఖ్యంగా ఒక మాఘమాసపు గాలి'గా అనువర్తితం చేసాడు. ఇలా లెక్క తేలిస్తే ఒక 20 ఆంగ్లకవితలు (వివిధ కవులవి) ఓ 16 ఫ్రెంచ్ కవితలు (ఇందులో పాల్ ఎల్వార్ వి 10, బోదెలేర్‌ది ఒకటి, విలాన్ ది ఒకటి, హెన్రీ మిషో 2, అపొలెనేర్ 2, దాలీ ఒకటి కాగా - గ్రీక్ నించీ, స్పానిష్‌నించీ, రష్యన్ నించీ మరికొన్ని - 8 కవితలు) ఉన్నయ్. ఇక కార్ల్ చాపెక్ 'మదర్', మయకోవస్కీ 'లెనిన్', యాంజెలో క్వార్టోచ్చి "బిగినింగ్ ఆఫ్ ది ఎండ్" - 'రెక్కవిప్పిన రివల్యూషన్', విలియం సారోయన్ నాటకం Fight Your Own War లాంటివి. వేరే ప్రక్రియలు. పురిపండా 'సౌదామిని', శ్రీశ్రీ Miscellany, Three Cheers for Man లు అందరికీ తెలిసిన విషయాలే.

ఈ నాటికీ ఎవరూ పట్టించుకోనిదల్లా ఈ ఒక్క 'స్వర్గ భైరవం' అనువాద కవిత ఒక్కటే.

నిజానికి ఆంగ్ల కవితా స్రవంతిలోనూ కూడా 1890ల నాటి క్షీణ కవిత్వ దశలో (ఉద్యమం అందామా?) కవిగా ఫ్రాన్సిస్ తామ్సన్ స్థానం అద్వితీయమైనదేమీ కాదు! అతనొక దిక్కుమాలిన కవి. దిక్కూ దివాణం లేని కవి! మందుమాకులకు (లాడనమ్) బానిసయి వీధిన పడ్డ కవి. ఇంగ్లండ్ వీధుల్లో వేలకి వేల కిలోల నల్లమందు అమ్మకానికి సిద్ధంగా ఉండేదారోజుల్లో-మన ఫ్రాన్సిస్ తామ్సన్‌కు హీరో ఎవరయ్యా అంటే రోల్ మోడెల్ ఎవరయా అంటే డిక్వెన్సీ. "కన్ఫెషన్స్ ఆఫ్ యాన్ ఇంగ్లీష్ ఓ



కనకదుర్గా చండసింహం
జూలు దులిపి
ఆవులించింది
ఇంద్రదేవుని మదపు టేనుగు
ఘీంకరిస్తూ / సవాల్ చేసింది!
నందికేశుడు రంకెవేస్తూ
గంగడోలును
కదిపి గెంతేడు
పుడమి తల్లికి
పురుటినొప్పులు
కొత్త సృష్టిని స్ఫురింపించాయి

అవతారం






పియమ్ ఈటర్"ని చదివి దాన్ని, ఆదర్శ స్థితిగా తీసుకొన్నాడు ఫ్రాన్సిస్ తామ్సన్. చర్చ్ ఫాదర్‌గా బతికేస్తాడులెమ్మని తండ్రి దానికి తగిన శిక్షణకు పంపిస్తే ఆ స్కూల్ ప్రిన్సిపాల్ మన కవిగార్ని 18వ ఏటే ఇంటికి పంపేసాడు. తండ్రి స్వయానా డాక్టరు. సరే తనలాగే డాక్టర్ని చేద్దామని లండన్‌కీ గ్లాస్‌గౌకి పంపిస్తే ఆరేళ్ళల్లోనూ మూడుసార్లు పరీక్షలు తప్పాడు. కార్మికులకు సాయంకాలానికల్లా ఒళు నెప్పులు తగ్గటానికీ, ఏడుస్తూన్న చిన్నపిల్లల్ని నిద్రపుచ్చటానికి ఆ రోజుల్లో డాక్టర్లే లాడనమ్‌ని మందు చీటీలుగా తల్లులకే రాసిచ్చేవారు.

కాని ఫ్రాన్సిస్ తామ్సన్‌కి కవిగా పేరు తెచ్చుకోవాలనే రహస్య కాంక్ష వెన్నాడుతూనే ఉండేది. మందుమీద ఇంకా ఇంకా గొప్ప కవిత్వం రాయగలనేమోననే భ్రమకూడ ఉండేది. ఆరోగ్యం పూర్తిగా క్షీణించి నిదానంగా మృత్యువుకి దగ్గరవుతూన్న ఆఖరి సంవత్సరాలలో అతన్ని చేరదీసి, సాకి, రక్షించిన విల్ఫ్రెడ్ మేనెల్, యాలిస్ మేనెల్ లు ప్రచురించే 'మెర్రీ ఇంగ్లండ్' ఆధ్యాత్మిక పత్రికలో (1888లో) అచ్చయింది ఈకవిత. కవి ఎవరో తెలీదు. కళ్ళెదుట కన్పించేప్పటికి ఆస్పత్రికి పంపించారు కవిగార్ని ఆ దంపతులు. అక్కడ్నించి ఓ స్వస్థత గృహానిక్కూడా. ఓ పది సంవత్సరాలపాటు మందుకి అప్పుడప్పుడూ దూరంగా ఉండటానికి చాలా దగ్గరగా ప్రయత్నించాడు. అతని కవితలు 1893లో 'పొయమ్స్'గాను, 1895లో 'సిస్టర్ సాంగ్స్' గాను, 1897లో 'న్యూ పొయమ్స్' సంకలనాలుగానూ అచ్చయినయ్. 1907లో క్షయ, లాడనమ్ రెండూ అతన్ని అంతంచేసినయ్. అతని మాటల్లోనే చెప్పాలంటే 'We are born in other's pain and perish in our own' అనుకోవాలి. అతన్ని చూడాలంటే - ఈనాడు -'Look for me in the nurseries of Heaven' అంటున్నాడు.

ఇలాంటి కవి రాసిన కవితను పుణ్యశ్లోకాయ మంగళమ్ భావంతో శ్రీశ్రీ అనువాదం చేసాడు. విప్లవకవి శ్రీశ్రీ చేసిన అనేక అద్భుతాలలో ఇదొకటిగా ఈ అనువాదాన్ని పరిశీలించాలి! మచ్చుకి మొట్టమొదటి స్టాంజానే చూద్దాం.

<u>THE HOUND OF HEAVEN</u>

I fled Him down the nights and down the days
I fled Him down the arches of the years
I fled Him down the labyrinthine ways
Of my own mind, and in the midst of tears
I hid from him, and under running laughter.
Up vistaed hopes I sped and shot precipitated
Adown Titanic glooms of chasmed tears
From those strong feet that followed, followed after
But with unhurrying chase and unperturbed pace,
Deliberate speed, majestic instancy,



చూడు, చూడు, నీడలు !
నీడలు, పొగమేడలు !
యుగయుగాల దోపిడిలో,
తరతరాల రాపిడిలో..
వగ దూరిన,
పొగ చూరిన
శాసనాల జాడలు
జాలిజార్చు గోడలు !
చూడు, చూడు, నీడలు !
నీడలు, పొగమేడలు !

నీడలు



They beat, and a Voice beat,
More instant than the feet:
All things betary thee who betrayest me.

ప్రత్యయ పదాలు వేగాన్ని సూచిస్తూ - down - 4 సార్లు adown ఒకసారి
midst, from, under, after పలుమార్లు గానూ
క్రియాపదాలు చర్యను సూచిస్తూ - fled - 3 సార్లు
followed, followed after; పునరుక్తిగానూ
విధ్యర్థ క్రియా పదంగా - I fled him 3 సార్లు (అంటే I hid me లాగనన్నమాట!)
అసంసర్గ క్రియగా - sped, shot, I hid from him (hid my self అని ఉండాలి)ఉన్నయ్.

క్రియా పదాలను అనువాదం చేయటం పెద్ద కష్టమేమీ కాదు. అనువాదకుడి శబ్ద సంస్కారం అంతా వెల్లడి అయ్యేది విశేషణ పదాలలోనే. ఈ దీర్ఘకవితలోని ప్రథమ పద్య ఖండంలో రెండు ముఖ్యమైన రూపకాలంకారాలు arches of the years, chasmed tears కి శ్రీశ్రీ పదాలివి -

సంవత్సరాల పల్లకీ వంపులు,
మూసిన కన్నీళ్ళ పొగమంచులు.

విశేషణా పదాలు రూపకాలంకారాలుగా -

మూలం	
labrinthine ways	మనః పద్మ వ్యూహాల మార్గాలు
running laughter	ప్రవహించే నవ్వులు
upvistaed hopes	ఆశల విశాలావకాశాలు
Titanic glooms	ప్రచండ గాఢాంధకారాలు
chasmed tears	దిగజారి పొగచూరి

ఈ మొదటి 15 పంక్తులలో కల్లా ముఖ్యమైన ఏడు పదబంధాలు

unhurrying chase	తడబాటులేని తొందరపాటులేని వేట
unperturbed pace	అదురుపాటు లేని గమనం
deliberate speed	చంక్రమణం
majestic instancy	సముద్దిష్ట మహోత్కృష్టవేగం
more instant	విడంబించు వేగిరింపు

నేరం చేసినవాడు పశ్చాత్తాపంపొందితే శిక్షాధికారికో రక్షకుడికో లొంగిపోతాడు. కానీ ఇక్కడ పరుగో పరుగో! ఈ వేగాన్ని ఆ మహోద్వేగాన్నీ మాటల్లోనే పట్టుకోవాలి మరి. తనని వెంటాడుతూన్న, వేటాడుతూన్న ఆ రక్షకుడి పాదాలు ఎటువంటివి? పాదాలతో బాటు పదాల పిడుగుపాటు -


They beat and a Voice beat = ఉరమని పిడుగులాగ ధ్వనిస్తాయి ఆ పాదాలు
అడుగుల పిడుగుల దడదడల....

ఆంగ్ల కవిత అచ్చయి, శ్రీశ్రీ అనువాదం చేసే నాటికి దగ్గర దగ్గరగా దాదాపు ఓ వంద సంవత్సరాల



అలసిన కన్నులు కాంచేదేమిటి?
తొణికిన స్వప్నం
తొలగిన స్వర్గం

పరాజితులు



ఔను నిజం, ఔను నిజం
ఔను నిజం నీవన్నది !
నీవన్నది, నీవన్నది,
నీవన్నది నిజం, నిజం !

మనమంతా బానిసలం,
గానుగలం, పీనుగలం !
వెనుక దగా, ముందు దగా,
కుడియెడమల దగా, దగా!


మనదీ ఒక బ్రతుకేనా?
కుక్కలవలె, నక్కలవలె!
మనదీ ఒక బ్రతుకేనా?
సందులలో పందులవలె!

చేదుపాట



కూటికోసం, కూలికోసం
పట్టణంలో బ్రతుకుదామని -
తల్లిమాటలు చెవినిపెట్టక
బయలుదేరిన బాటసారికి,
మూడు రోజులు ఒక్క తీరుగ
నడుస్తున్నా దిక్కు తెలియక
నడిసముద్రపు నావరీతిగ
సంచరిస్తూ, సంచలిస్తూ
దిగులుపడుతూ, దీనుడౌతూ
తిరుగుతుంటే -
కళ్ళు వాకిట నిలిపి చూచే
పల్లెటూళ్ళో తల్లి ఏమని
పలవరిస్తుందో....?

బాటసారి



ఉగ్రవాది విశ్వనాథ....

ఆయనేమో! విబూది పూసుకుని కత్తి
పట్టుకుంటాడు

ఈయనేమో! ఎఱ్ఱజెండా పట్టుకుని కన్నీరు
పెట్టుకుంటాడు

విశ్వనాథ రాముడూ కల్పవృక్షం
శ్రీశ్రీ మానవుడూ మహాప్రస్థానం

విశ్వనాథ కిన్నెరసాని
శ్రీశ్రీ కవితా – ఓ కవితా

విశ్వనాథ వేయిపడగలు
శ్రీశ్రీ సామాన్యుడి గొడవలు

విశ్వనాథ తులసితీర్థం
శ్రీశ్రీ తీర్థం – తీర్థం

విశ్వనాథ పంచపాత్ర – ఉద్ధరిణీ
శ్రీశ్రీ ప్రపంచ పాత్ర – ఉద్ధరణ

విశ్వనాథ సంధ్యావందనం
శ్రీశ్రీ అరుణోదయం

విశ్వనాథ విశ్వామిత్రుడు
శ్రీశ్రీ విశిష్టుడు

తనికె

© 9



…. ఛాందసుడు శ్రీశ్రీ

విశ్వనాథ వత్తీ – ప్రమిద
శ్రీశ్రీ సుత్తీ కొడవలీ

విశ్వనాథ కర్పూరం
శ్రీశ్రీ కాగడా

విశ్వనాథ మల్లె
శ్రీశ్రీ మందారం

విశ్వనాథ పెరుగుపచ్చడి
శ్రీశ్రీ కొరివికారం

విశ్వనాథ చాతుర్వర్ణం
శ్రీశ్రీ వర్ణచాతుర్యం

విశ్వనాథ విజయవాడ
శ్రీశ్రీ విశాఖ

విశ్వనాథ కవిసామ్రాట్
శ్రీశ్రీ యుగకవి

విశ్వనాథ శివార్పణం
శ్రీశ్రీ శ్రీరంగం

కుడిచేత్తో విశ్వనాథకి నమస్కారం!!
ఎడంచేత్తో లెఫ్టిస్టుకి సెల్యూట్!!

శ్రీశ్రీ 19[illegible]


ఇద్దరికీ రెండు చేతులూ కలిపి పాదాభివందనం





పాపం, పుణ్యం ప్రపంచమార్గం -
కష్టం, సౌఖ్యం, శ్లేషార్థాలూ
ఏమీ ఎరుగని పూవుల్లారా
అయిదారేడుల పాపల్లారా
మీదే, మీదే సమస్త విశ్వం
మీరే లోకపు భాగ్యవిధాతలు
వాడుతల్లారా!
బుడతల్లారా!
ఇది నా గీతం వింటారా?

శైశవగీతి



నరాలబిగువూ,
కరాల సత్తువ
వరాల వర్షం కురిపించాలని,
ప్రపంచ భాగ్యం వర్ధిల్లాలని-
గనిలో, పనిలో, కార్ఖానాలో
పరిక్లమిస్తూ,
పరిప్లవిస్తూ,
ధనికస్వామికి దాస్యంచేసే,
యంత్రభూతముల కోరలు తోమే
కార్మిక వీరుల కన్నుల నిండా
కణకణమండే
గలగలతొణకే
విలపాగ్నులకు, విషాదాశ్రులకు
ఖరీదుకట్టే షరాబు లేడోయ్ !

ప్రతిజ్ఞ




కాలపుటెడం ఉంది. (1888 మూలం, 1982 అనువాదం) కానీ మూలంలోని కొన్ని పాతకాలపు పదాలకు (ఆర్కేయిక్) శ్రీశ్రీ ఆనాటి అర్థాల్నే ఇవ్వటం గమనార్హం.

ఇలాంటి కాతలిక్ భక్తి కవితలలో ఆనాటికి వాడుకలో ఉన్న పదాలివి -

మూలం	
margent (పంక్తి 25)	అంచుల్లో
clanged (27)	నినదించే
dulcet (28)	వెండి సవ్వడులు
pale ports (29)	రేరేని రేవుల్లో
savannahs (41)	వినీలాకాశపు మైదానాలను. (కాని వాస్తవానికి సముద్రాలని ఉండాలి)
Plashy (44)	చిత్తడిలో (ఇదీ తప్పే. కలగలిసిన అని అసలు అర్థం)
chalice (71)	మధుకలశిక
quaffing	పెడసరపు ముఖం
spumned (79)	విలోల విజృంభణ
drouth (99)	దప్పిక
owe (100)	ఋణం
sun stars (123)	ఆకాశ దుకూలపు(?)
amaranthine (131)	అమరలోక పారిజాతం
limn (135)	రానీయనిది (?) లాగలేనిది?
bruit (156)	గాలి కబురు. (తప్పు. ఇక్కడ ఒక మహాధ్వని, పెద్ద శబ్దం)

ఇక నిజమైన పరీక్షకు నిలిచే కొన్ని పదబంధాలనూ పంక్తులనూ చూద్దాం.

మూలం		
cypress crowned	- శరవణ దళ కిరీటం	ఆధునిక ప్రాచీన ప్రబంధ పదబంధాలు !
broken fount	- శిధిలమైన కేళాకూళి	
outlaw wise	- దేవ భ్రష్టుడి లాగ - దేశదిమ్మరి?	
betray	- కికురించు (?) మోసగించు?	
skiey blossoms	- గగన పుష్పాలు, (నక్షత్రాలు?)	
Fear wist not to evade,	- ఆ వెన్నాడుతున్న వాని	'విస్ట్' పాతకాలపు పదం
as love wist to pursue	- విన్నాణపు ప్రేమ	
be sudden	- ఉన్నపాటున రమ్మని	



నేను సైతం
ప్రపంచాబ్జపు
తెల్లరేకై పల్లవిస్తాను!

నేనుసైతం
విశ్వవీణకు
తంత్రినై మూర్ఛనలు పోతాను!

నేను సైతం
భువనభవనపు
బావుటానై పైకి లేస్తాను

'జయభేరి'



Dawn	- ఉషస్సు
tremendous lover	- ప్రచండ ప్రేమికుడు
vague veil	- అవ్యక్త సంధ్యావకుంఠనం
loyal deceit	- నమ్మకమైన మోసం
	ఆక్సీమొరాన్ }
traitorous trueness	- విద్రోహపు నిజాయితీ
	అలంకారాలు !
whistling mane	- ఈదరగాలి జూలు
man or maid	- మనిషినీ మగువనూ (ఇది తప్పు)
	ప్రకృతి-పురుషుడు?
young eyes	- పరువపు కళ్ళు (తప్పు) మూలంలో
	లేత నయనాలు?

(గమనిక : మూలకవితలో కూడ కొంత సందిగ్ధత ఉంది. ఒకోసారి కవి ప్రకృతిని Lady Mother అని సంబోధిస్తాడు. ఆనిడ రక్షణ కోరుకుంటాడు ఆమె సాన్నిధ్యంలో. కాతలిక్ మత సంప్రదాయంలో ఈ Lady Mother మేరీమాత కావాలేమో? తనని వెంటాడుతున్న ప్రచండ ప్రేమికుడు దేవుడు. పురుషాకారుడు! పేరు లేదితనికి. జీసస్ అనుకోవాలా? శ్రీశ్రీ ఈ సందిగ్ధాన్ని పట్టించుకున్నట్టు లేదు.)

wantoning caresses	-	గిలిగింతల కౌగిలింతలు
vagrant tresses	-	చెల్లాచెదరైన శిరోజాలు (కానే కాదు!)
luscent weeping	-	ప్రకాశమాన బాష్పధారలు

(మరో గమనిక : ఫ్రాన్సిస్ తామ్సన్ కవిత్వంలో శుష్కపదాడంబరం ఎక్కువనీ అతనిది సహజ కవిత్వం కాదనీ ఒక విమర్శ ఉండనే ఉంది. కాకపోతే అతని కవితల్లోకల్లా ఎక్కువమంది ఈ నాటికీ ఉటంకించేది ఇదొక్కటే. అనువాదం చేస్తూన్నపుడు శ్రీశ్రీ లాంటి విప్లవకవికి చిరాకు కలగకపోవటం చాల విచిత్రం. ఇదేమీ బాదెలేర్ కవిత్వం లాంటి ఫ్రెంచ్ మద్యం కాదుకదా!)

swift importings	-	పాడిపాడి అక్షరాలు. (ఏమాత్రం సరైన పదం కాదు. ఇక్కడ ఇవి ఆకసంలోని మెరుపులు)
sea snortings	-	కడలి గురకలలో
clouds arise spumed	-	వలాహకాల విలోల విజృంభణ
wailful divine	-	విలపించే దివ్యత్వం

(మిగతా సందిగ్ధావస్థ. అస్పష్టత. మూలంలోదే. శ్రీశ్రీ తప్పు కాదు)

: When she lit her glimmering tapers round the day's dead sanctities

: పగటి మరణించిన పావిత్ర్యాల చుట్టూ ఆమె ప్రకాశించే కాగడాలు వెలిగించినపుడు


అనితరసాధ్యం నా మార్గం



: Heaven and I wept together

: కలసికట్టుగా విలపించాం స్వర్గమూ నేనూ

: Heaven's gray cheek

: స్వర్గపు పొగచూరిన చెక్కిలిమీద

: they speak by silences

శ్రీశ్రీ ఈ సందర్భంలో sound, stir అన్న పదాలను సరిగ్గా గమనించినట్టు లేదు.

: ఇది మాట్లాడేది నిశ్శబ్దాలతో. (నిశ్శబ్దాలలో?)

: bosom veil of sky

: ఆకాశ దుకూలపు విశాల విలాస వక్షోచ్ఛాదనాన్ని

(శ్రీశ్రీ కూడ శబ్దలౌల్యానికి లోనయినట్టున్నారు!)

: And past those noised Feet, A voice comes yet more fleet

: ఆ వివిధ్వనత్పాదాల వేగాల క్షిప్తంగా (ఆహా ఏమి శబ్దానుకరణ!)

: mangled youth

: వంకర టింకర్లుగా నా యౌవనం

: strange piteous futile

విచిత్ర విషాదకర విఫల

ఈ అనువాద రచనలో శ్రీశ్రీ వాడిన (వెంటాడే వేటాడే దేవుడే అనుకోండి -) అధిక్షేప పదాలు కొన్ని :

క్షుద్రనరా
మట్టిపెళ్ళవురా నువ్వు
నీలాంటి నికృష్టుడ్ని
హీన నరా లేరా
అనన్యం నీ ఆంధ్యం
అద్వితీయం నీ దౌర్బల్యం

స్వర్గ రక్షకుడివి, రాక్షసుడివా ఈ ఉద్బోధనలు!

నీచార్థంలో ఈ కవితను వేటకుక్క,కుందేలుగానూ ఉన్నతార్థంలో ఇహపర ప్రేమలుగానూ అర్థం చేసుకోవాలేమో.

1980ల క్షీణ యుగంలోని దిక్కుమాలిన, దిక్కులేని, దారీ తెన్నూ కానని ఫ్రాన్సిస్ తామ్సన్ లాంటి కవి రచించిన ఈ అవ్యక్త గుప్త సంక్లిష్ట అస్పష్ట అసందర్భ అమానవీయ కవితని శ్రీశ్రీ లాంటి పురోగామి కవి మానవ స్వర్గంలాంటి మరో ప్రపంచపు కవి అనువదిస్తూ తన విలువైన సమయాన్ని వృధా చేసుకొన్నారేమోనని నా సందేహం. ఎక్కడి స్విన్ బర్న్! ఎక్కడి ఫ్రాన్సిస్ తామ్సన్!

అసలు మూల కవితలోనే నిబిడమై ఉన్న sexual symbolism నీ కవి ఫ్రాన్సిస్ తామ్సన్ లైంగిక నిస్పృహనీ శ్రీశ్రీ గమనించారో, లేదేమో !




అలకలన్నీ అట్టగట్టిన,
బొమికలన్నీ ప్రోవు పట్టిన,
కాగితంవలె పలచబారిన
వెఱ్రివాడా ! కుఱ్ఱవాడా !

వీధికంతా వెక్కిరింతగ.
ఊరికంతా దిష్టిబొమ్మగ,
తూము ప్రక్కన ధూళిలోనే
తూలుతున్నావా?

నీవు చూపే వెకిలి చూపూ,
నీవు తీసే కూని రాగం,
మాకు తెలియని నీ ప్రపంచపు
మహారణ్యపు చిక్కు దారులు !

ఉన్మాది



స్వర్గ భైరవం

పరుగు తీశానతడినుంచి,
పగళ్లూ రేలూ గడచి,
పరుగెత్తా నతడినుంచి,
సంవత్సరాల పల్లకీ వంపులు
దూసి,
పరుగెత్తా నతణ్ని తప్పించుకుని, నా
మనః పద్మవ్యూహాల మార్గాలు తీసి,
ాగున్నా నతణ్ని కాదని, నా కన్నీళ్ళ పొగమంచులు మూసి
రుచుకుని, పదిలపరుచుకుని ఇక ప్రవహించే నవ్వుల
ివాసీ.

రుగులెత్తాను, ఆశల విశాలావకాశాల మీద జోరు హెచ్చించి,
ురకలతో, చిలకరించిన మీగడ తరకల్లాగ హోరురెట్టించి,
యాల గిరి గహ్వరాల ప్రచండ గాఢాంధకారాల
ిగజారి పొగచూరి
లాయనం చిత్తగించాను నను తరుముతూన్న, వెంట
తరుముతూన్న ఆ బలిష్ఠ పాదాలనుంచి.

అయినాగానీ ఏ తడబాటులేని తొందరపాటులేని వేటతో,
అదరుపాటులేని గమనంతో చంక్రమణంతో,
ముద్దిష్ట మహోత్కృష్ట వేగంతో,
ండ ప్రచండమై విడంబించు వేగిరింపుల సరాగంతో

ురమని పిడుగులాగ ధ్వనిస్తాయి ఆ పాదాలు –
ఆ తడబడని పొరపడని అడుగుల పిడుగుల
దదడల కన్నా ఆకస్మికంగా
ిస్వనిస్తుందొక గొంతుక నన్ను హెచ్చరిస్తూ :
"అన్నీ నిన్ను కికురిస్తాయి, నన్ను నువ్వు కికురిస్తే" అని.
ేబిరించాను దీనంగా, దేవ భ్రష్టుడిలాగ,
్రని తెరల ఎన్నెన్నో గవాక్షాల హృదయాల మాటున,
న వేసుకున్న దయాధర్మాల చాటున,
బాగా నాకు తెలిసినా ఆ వెన్నాడుతున్నవాని విన్నాణపు
ేమ,
యపడిపోయా నెంతగానో, ఏమంటే
(అతనుంచే ఇతర మేదీ ఇక నాకుండదని.)
కాని, ఒక చిన్న వాతాయనం విచ్చుకుంటే తేలుతూవాలి,
ఆ దారిని మూసివేస్తూ దతని ఆగమనపు హోరుగాలి.
ీతికి తప్పించుకోవడం తెలియదు
ేమకు వెన్నాడడం తెలిసినట్టు.

పరుగెత్తాను ప్రపంచం అంచులు సోకి,
గింజుకుని గుంజేశాను నక్షత్రాల బంగారు ద్వారాలను,
చల్లగా మెల్లగా తాకి,
వాటి నినదించే ఇనుప కమ్ముల వెనుక ముసరి,
తలకొట్టుకున్నాను ఆశ్రయం కోసం కొసరి!
రేరేని పాలిపోయిన రేవుల్లో మధురంగా నిశ్వసించి,
వెండి సవ్వడులు వినిపించాను వెర్రిగా విహ్వాలించి

ఉషస్సుతో అన్నాను : ఉన్నపాటున రమ్మని
సాయంత్రంతో అన్నాను : షిప్రగామిని కమ్మని
నీ ప్రభాత కాల సుకుమార గగన పుష్పాలను
కుమ్మరించ మన్నాను కుప్పకుప్పలుగా నా మీద
రక్షించి, నన్నీ ప్రచండ ప్రేమికుడి నుంచి!
తేలించమన్నాను నీ అవ్యక్త సంధ్యావకుంఠనం నా చుట్టూ,
అత డెలాగయినా సరే, చూడకూడదని నా తట్టు!
ప్రలోభపరిచాను అతని భృత్యు లందరినీ,
కాని వారి అకుంఠిత విశ్వాసంలో కనిపించింది నా
విశ్వాసద్రోహం,
వారి అచంచల భక్తిలో విచలించింది నాచపలచిత్త
వ్యామోహం,
చూశాను వారి విద్రోహపు నిజాయితీ, నమ్మకమైన మోసం.
చేశాను వేగశీలమైన వాటి వేగంమీద ఫిర్యాదు,
వేలాడేను వీచే ప్రతీ ఈదరగాలి జాలునూ పట్టుకుని
కాని అవి చల్లగా జోరుగా వినీలాకాశపు మైదానాలను
తుడిచిపెట్టుకు పోతున్నా
లేదా, జలధర గర్జనల సారథ్యంలో
పెళపెళమని అతని రథాన్ని ఒడిసి పట్టుకు పోతున్నా
ఎగిసి పడే మెరుపుల చిత్తడిలో
వాటి పాదాల హేళనల ముట్టడిలో –
భీతికి తప్పించుకోవడం తెలియదు
ప్రేమకు వెన్నాడడం తెలిసినట్టు.
అయినాగానీ నీ తడబాటు లేని తొందరపాటు లేని వేటతో,
అదరుపాటు లేని గమనంతో, చంక్రమణంతో,
సముద్దిష్ట మహోత్కృష్ట వేగంతో,
చండ ప్రచండమై విడంబించు వేగిరింపుల సరాగంతో,
వచ్చేశాయి వెన్నాడుతున్న పాదాలు, విన
వచ్చిందొక కంఠధ్వని
ముంచెత్తి ఆ పాదాల లయబద్ధ నినాదాల
"ఏదీ లేదు నీ కాశ్రయం ఇచ్చేది,



ముళ్ళూ, రాళ్ళూ, అవాంతరాలెన్ని ఉన్నా
ముందు దారి మాది
ఉన్నచోటు చాలును మీకు
ఇంకా వెనక్కి పోతామంటారు కూడా
మీలో కొందరు
    ముందుకు పోతాం మేము
    ప్రపంచం మావెంట వస్తుంది
అభిప్రాయాల కోసం
బాధలు లక్ష్యపెట్టని వాళ్ళు
మాలోకి వస్తారు

వ్యత్యాసం




నీవు నా కాశ్రయం ఇచ్చేది
లేదంటే" అని.

మరి వెదకడం మానేశాను
తిరిగాను దారి తప్పినట్టు
ఎదిరించి మనిషినీ మగువనూ,
ఏకాంతమే నాదారిచుట్టూ,
అనిపించిందప్పుడు జవాబు, విందాం
వాళ్ళేమంటారో అని,
కనీసం వాళ్ళే నా వాళ్ళు, ఔను నాక్కావలసినవాళ్లు!
తిరిగి చూశాను వాళ్ళవైపు
ఆశగా ఎంతో సేపు,
కాని అకస్మాత్ సౌందర్యంతో వారి పరువపు కళ్లు
ప్రత్యుత్తరాల ప్రత్యూషాలు ప్రసరించేలోగా, సరిగా
ఆ సమయానికే లాగేసింది
వాళ్ళ దేవదూత జుట్టుపట్టుకుని నా నుంచి వాళ్ళని.
"అయితే రండి, ఇంకోలాంటి శిశువుల్లాంటి
ప్రకృతి నిసువుల్లారా రండి నాతో" (అన్నాన్నేను)
"పంచుకోండి నాతో మీ సుతిమెత్తని సాంగత్యాన్ని,
పలుకరించ నియ్యండి మిమ్మల్ని పెదవికి పెదవిగా,
చిలకరించ నియ్యండి గిలిగింతల కౌగిలింతల
అల్లికల ఉల్లాసాల నవ్వుల నవ మల్లికల,
చెలగాట లాడనియ్యండి నన్ను, మన మాతృదేవి
చెల్లాచెదరైన శిరోజాలతో,
విందారగించ నియ్యండి ఆమె అందాల గాలిగోడల
భవనాలలో,
తాగనియ్యండి ఆమె వినీల వితర్దిక కింద
మీ ఆకల్మష పద్ధతిలో నన్ను,
ప్రకాశమాన బాష్ప ధారలు కురిసే
దివ స్సరోవర మనోహర సుమధుర మధు కలశిక నుంచి."

అంతే, అలాగే జరిగిందంతా:
నేనూ వాళ్ళ సున్నితపు సాహచర్యంలో సమైక్యంపొంది
ప్రకృతి దాచుకున్న అనేకానేక రహస్యాల
గడియలు విడలాగాను, చదివేశాను విహాయసాల
పెడసరపు ముఖం మీది పొడిపొడి అక్షరాలన్నీ,
తెలుసుకున్నాను అదుపులేని కడలి గురకలలో
ఉబుకుతూ నురగలతో లేచే
వినీల వలాహకాల విలోల విజృంభణ విధానాలన్నీ,
పుట్టేదీ గిట్టేదీ సమస్తమూ పైకిలేచి పక్కకు వాలి పోతూంటే
అన్నింటిలోనూ ఆకారం రచించు కున్నాను
విలపించే దివ్యత్వం వెలిగించే, నా విభిన్న మనో విభ్రమాలకు
–
వినోదంగా వాటితో ఆనందించి వియోగంలో విభ్రమించాను.
బరువెక్కాను సాయం సంధ్యతో,
పగటి మరణించిన పావిత్ర్యాల చుట్టూ ఆమె
ప్రకాశించే కాగడాలు వెలిగించినప్పుడు
ప్రభాతకాల బాల నేత్రాలలో పకపకమని నవ్వాను.
శీతోష్ణాల వాతావరణా లన్నిటిలో కలిసి
విషాదమూ విజయ గర్వమూ పొందాను,
కలిసి కట్టుగా విలపించాం స్వర్గమూ నేనూ
మరిదాని తీయని కన్నీళ్లు క్షారమైనాయి నామర్త్యాశ్రువులతో
కలిసి,
దాని సూర్యాస్తమాన హృదయాన హత్తి,
అచ్చటి ఎర్రని స్పందన కెదురుగా
పరచుకొని నా హృదయాన్ని ప్రతిస్పందించనిచ్చాను,
కాని అంతమాత్రాన కాదు, అంతమాత్రం చేతకాదు
నా మానవీయ వేదనకు వెసులుబాటు
చెమ్మగిల్లాయి నా దుఃఖాశ్రువులు స్వర్గపు
పొగచూరిన చెక్కిలిమీద నిష్ప్రయోజనంగా.

ఏలనగా ఆహా! మాలో ఎవరికీ
ఒకరిమాట లింకొకరి కర్థం కాలేదు,
నేనూ ఈ వస్తువులూ ధ్వనులతో మాట్లాడుతాను నేను
వీటి చప్పుడు తమ తమ కదలికలు మాత్రం,
ఇవి మాట్లాడేది నిశ్శబ్దాలతో,
ప్రకృతి, పాపం, సవతితల్లి! తీర్చలేదు నా దప్పిక,
నాకే ఆమె ఋణం ఉంటే చూపించుగాక
తన సుకుమార పయోధరాల,
తొలగించి ఆ దూరపు వినీలపు ఆకాశదుకూలపు
విశాల విలాస వక్షోచ్ఛాదనాన్ని :
దాహంగొన్న నా నోటి నాక నాటికీ
ఆశీర్వదించనే లేదు ఆమె చనుబాలు.

ఇంకా ఇంకా దగ్గర పడుతోందావేట, ఆ వెంటాట,
తడబాటులేని అడుగుల దడదడలతో,
ఉద్దిష్ట వేగంతో, ఉదాత్తపు వేగిరింపులతో,
అంతలో అధిగమించి ఆ వివిధ్వనత్వాదాల వేగాల
విన వస్తుందొక కంఠధ్వని మరీ మరీ క్షిప్రంగా –
నిన్నేదీ సంతృప్తి పరచబోదు సుమా,



కదిలేదీ, కదిలించేదీ,
మారేదీ, మార్పించేదీ,
పాడేదీ, పాడించేదీ,
మునుముందుకు సాగించేదీ
పరిపూర్ణపు బ్రదుకిచ్చేదీ
కావాలోయ్ నవకవనానికి

'నవకవిత'







"నిన్నేనీవు సంతృప్తి
పరచకపోతే" అని.
దిగంబరంగా
నిలుచున్నాను ఎత్తిన నీ
ప్రేమ ప్రహారానికి, వేచుకుని
పడిందిదెబ్బ, ముక్కముక్కలుగా
చీల్చావు నాకవచాన్ని
వేసిన నీ వ్రేటుకి పడిపోయాను
మోకాళ్ళమీద,
అయిపోయానసహాయుణ్ణి, పిసరంతైనా రక్షణలేనివాణ్ణి
అనుకున్నా నిద్రించానని, అంతలో మేల్కొన్నాను.
తెలుసుకున్నా నింపాదిగా తేరిచూస్తూ
నిద్రలో దిగంబరుణ్ణయానని
పొంగే నా యౌవన శక్తుల పొగరుబోతు దూకుడులో,
కుదిపి వేశాను స్తంభాల్లా నిలబడ్డ ఘడియల్ని,
లాక్కున్నాను నా మీదకు నా జీవితాన్ని
దాక్కున్నాను నాలోనే నేను,
బురదల మరకలతో నిండి నిలుచున్నాను,
నాచు పట్టిన సంవత్సరాల పెనుధూళి మధ్య-
ఆ కుప్పకింద కొంకర్లు తిరిగి వంకర టింకర్లుగా
పడిపోయింది మరణించి నాయౌవనం.

బీటలు వారి నా రోజులు పొగలో ఎగసిపడి
పొంగులు వారి బ్రద్దలయినాయి
సెలయేటి మీద మిల మిలలాడే సూర్యకాంతిలాగ
ఔను, స్వప్నం దగా చేసిందిప్పుడు స్వాప్నికుణ్ణి,
వీణ వైణికుణ్ణి వలె,
ఏ గొలుసు గొలుసుల భ్రమల గుత్తులు గుత్తులు మడతలో
భూమిని నా ముంజేతి కంకణం చేసి తిప్పుకున్నానో
ఆ భ్రమలు కూడా లింగిపోయాయి
తమ బలహీనపు త్రాళ్ళు ధాత్రికి సమాధానం చెప్పుకున్నాయి
అశేష విషాద భారంతో !
ఆహా! అయితే నీ ప్రేమ పెళుసైన కలుపుమొక్కలాంటిదా?
ఏమో అది అమరలోక పారిజాతమో ఏమో,
తామంత తన పువ్వుల్ని తప్ప
ఇరుపంచలకైనా ఇతర సుమాలను రానీయనిది?
ఆహా! అనంత చిత్రకల్పన శిల్పీ!
కట్టెను కాలిస్తేగాని దానితో గాలిలో చిత్రించలేవా?
ధూళిలో వ్యయమయింది నాసవ్యత్వపు చంచల వర్షం.

ఇప్పుడు నా హృదయం శిథిలమైన కేళాకూళి,
అందులో కన్నీటి బొట్లు కరడు కడతాయి ధారాపాతంగా
స్రవించి,
నా కొమ్మలున్న కన్నుల మనసుమీద వడకే తడిసిన భావాల
నుంచి!
ఇప్పటికింతే, ఇక ముందేమవుతుంది?
గుజురే అంత చేదయితే ఏమనుకోవాలి పైతొక్కరుచి?
పొగమంచులో కాలం పొరపాట్లు పోల్చుకుంటాను
చూచాయగా,
అయినా అవ్యాహతంగా ధ్వనిస్తుందొక తూర్యరావం
అనంత కాలపు నిగూఢప్రాకారాలనుంచి,
కుదుపులతో కుమిలే ఆ విషాద తుషారాలు
స్థలాలను పరాస్తంచేసి తర్వాత మళ్ళీ కడుగుతాయి
సగం సగం కనిపించే బురుజులను చుడుతూ,
కాని అతనికన్న ముందుగా కాదు
నన్ను రమ్మని పిలిపించిన, నాకు తొలిసారి కనిపించిన,
మెరిసే ఊదారంగు వసనాల చీకటిలో శరవణదళ కిరీటం
ధరించిన,
అతని కన్నముందుగా కాదు,
తెలుసు నా కతని పేరు, ఎరుక నాకతని తూర్యధ్వని
ఏమంటుందో,
మానవుని హృదయమో జీవితమో ఫలసాయం నీ కందిస్తే
అప్పుడు నీ పంట పొలాలు

కోరాలా మురికి యెరువుగా, కుళ్లిన మృత్యువునే?
ఇంతలో హస్తగతమవు తుందిప్పుడు
వింతగా నన్నింతగా వెంట దరుముతున్న
పరుగులను గురించిన గాలి కబురు,
చుట్టు ముడుతుంది నన్నా గొంతుక చప్పుడు
విరగబడి పగిలిపగిలి విరుచుకుపడే సముద్రంలాగ,
"అంత చెడిపోయిందా నీ భూమి పెంకులు పెంకులుగా
ముక్క చెక్కలయి?
చూడు అన్ని వస్తువులూ నిను విడిచి ఎగిరిపోతాయి,
నానుంచి నువ్వెగిరి పోతున్నావు కావున!
విచిత్ర విషాదకర విఫల వస్తువా!
ఎందుకు ప్రత్యేకించాలి ప్రేమను ఎవరైనా నీ కోసం?
తెలియదా నన్ను మించి శూన్యం నుంచి
ఎవ్వరూ ఏదీ సృష్టించలేదని" (అన్నాడతడు)
"కావాలి మానవ ప్రేమకు మాననీయమైన అర్హత:

౮



నేను సైతం
ప్రపంచాబ్జపు
తెల్లరేకై పల్లవిస్తాను!

నేనుసైతం
విశ్వవీణకు
తంత్రినై మూర్ఛనలు పోతాను!

నేను సైతం
భువనభవనపు
బావుటానై పైకి లేస్తాను

'జయభేరి'




మానవుని మట్టి
పెళ్ళలన్నింటికన్నా
మసక బారిన మట్టి
పెళ్లవురా నువ్వు, ఏదీ
నీకంత యోగ్యత?

అయ్యో! నువ్వెరుగనే ఎరుగవు
ఏ ప్రేమకయినా నువ్వెంత
అనర్హుడివో!
నీలాంటి నికృష్టుణ్ణి ప్రేమించే వాణ్ణి
ఎవణ్ణి చూడగలవురా నన్ను తప్ప, నన్ను మాత్రం తప్ప?
నీకు హాని కలిగించడానికి కాదు, వినరా క్షుద్రనరా!
నీ వద్ద నుంచి నేను తీసుకున్నదంతా,
ఎందుకనుకున్నావు తీసుకున్నానని,
దాన్ని నువ్వు కనుక్కోవాలని నాబాహు పరిష్వంగంలో!
దేన్ని నీపసిపాపడి పొరపాటు భావించిందో పోగొట్టుకున్నట్టు,
ఏతత్సమస్తమూ పదిల పరిచాను నేనే
ఇంట్లో నీకోసం భద్రంగా !
కనరా, హీననరా, లేరా!
కరం కరంతో గీలించు, మరి రారా?"
ఆగుతుంది నా చెంతనే ఆ పద నిపాతం :
ఇంతకూ నాధ్వాంతమంతా
అనునయిస్తూ చాచిన అతని చేతుల నీడేనా?
"ఆహా, అత్యంతం నీమమత,
అనన్యం నీ ఆంధ్యం, అద్వితీయం నీ దౌర్బల్యం
ఎవణ్ణి నువ్వు వెదుక్కుంటున్నావో వాణ్నే నేను!

ప్రేమనే తరిమి వేశావుగా నీ నుంచి,
నన్నే తరిమి వేసిన నువ్వు."

ముద్రణ : భారతి, మాసపత్రిక, ఫిబ్రవరి 1982




మరో ప్రపంచపు మహాస్వప్నమా
మలుపుతిరిగి వెళిపోయావా
విప్లవకవితా శతఘ్ని శతాగ్ని
ఘోషభాషవైవున్నావా!?

శ్రీకారానికి అకారంగా
నిలిచివుండవోయ్ సదాసదా
అభ్యుదయంలో అదృశ్యంగా
కలిసిముందుకే పదాపదా !

దేవిప్రియ

బొమ్మ: మోహన్



ఆ సాయంత్రం..
రాక్సీలో నార్మాషేరర్,
బ్రాడ్వేలో కాంచనమాల!
ఎటకేగుటో సమస్య తగిలిం
దొక విద్యార్థికి!

ఆ సాయంత్రం...
ఇటు చూస్తే అప్పులవాళ్లూ
అటు చూస్తే బిడ్డల ఆకలి!
ఉరిపోసుకు చనిపోవడమో,
సముద్రమున పడిపోవడమో -
సమస్యగా ఘనీభవించిం
దొక సంసారికి !

సంధ్యా సమస్యలు







కలం బలం కలకలం శ్రీశ్రీ

డాక్టర్ సత్రీ • 94413 08595

రెండక్షరాల శ్రీశ్రీ తెలుగు సాహిత్యానికి రెండు కళ్ళు అనుకుందామనుకునే లోపు మరోచూపు చొచ్చుకుపోతుంది. సామాజిక రుగ్మతలు చిర్రెత్తించిన అన్ని సందర్భాల్లో శ్రీశ్రీలో త్రినేత్రుడు తీక్షణమౌతాడు. నన్నయ్య నించీ శ్రీనాథుని వరకూ సాగిన అనువాద యుగానికి మరో మలుపు శ్రీశ్రీ. ప్రబంధకవుల దగ్గర నిలిచిపోయిన శబ్దభేరి విద్యకు పునరుత్థాన రూపం శ్రీశ్రీ. ఏ విశిష్టతలు శ్రీశ్రీని మహాకవిగా మలచాయో, ఏ విలక్షణత శ్రీశ్రీని యుగకర్తగా చేసిందో ఆ లోతుల్లోకెళ్ళటం కవి శతజయంతి సంవత్సరంలో యువలోకం నవలోకం కనీసబాధ్యతగా పేర్కొనాలి.

సాహిత్యంతో బొత్తిగా అనుబంధం లేని ఉపాధి ఆధారిత చదువులు ఊదర కొడుతున్న ఊసరవెల్లి కాలంలో కవిపండితుల గురించి కనీసమైనా ఈ తరానికి తెలియాలి. ఏ కవి శతజయంతి వేడుకైనా అదిచ్చే స్ఫూర్తి సమాజానికి దీపస్తంభమై సందడి చేస్తుంది. శ్రీశ్రీ అనేసరికి ఆ వెలుగు కొంచెం ఎక్కువేమో! ఓ సూపర్‌నోవా కూడా కావచ్చు. శ్రీశ్రీ అనే అక్షరం నక్షత్రమైతే చాలనుకుంటే ఒక్క మహాప్రస్థానమే నక్షత్రమై తక్కిన ఇరవై సంపుటాలకి విస్తరించిన శ్రీశ్రీ సాహిత్యం నక్షత్రమండలంగా నమ్మిస్తోంది.

కష్టజీవికి ఇరువేపులా నిలబడేవాడు కవి అయితే, అన్నివేపులా నిలబడి అక్కున చేర్చుకునేవాడు శ్రీశ్రీలా ఓ మహాకవి. ఓ కర్మాగారానికి మౌలిక వసతుల అవసరం ఏ పాటిదో కవితాసౌధానికి కావాల్సిన ముడి సరుకు శ్రీశ్రీకి కొంచెం ఎక్కువే తెలుసు కనక కదిలేదీ, కదిలించేదీ కవిత్వంగా నిర్వచించాడు. ప్రపంచాన్ని విశ్వ దృష్టి, భువనఘోషల నడుమ ముప్పేటముడిగా కవిత్వాన్ని మండిస్తాడు... తడుపుతాడు... వంత పాడతాడు. అక్షరంతో భూమార్గం పట్టించటం, భూకంపం పుట్టించటం చేతనైన మానసిక శ్రామికుడు. స్వేదం వేదం అని నమ్మిన సమతారాగాల సంగీతజ్ఞుడు. అభ్యుదయ, విప్లవ మార్గాల్ని స్వర్గారోహణంగా భావించి భాసిల్లిన బలం కల కలం, కలకలం శ్రీశ్రీ. పెట్టుబడిదారి వర్గం పాలిట భూతం... ఆధునికతకి యజ్ఞోపవీతం... కార్మిక కర్షక జనం గుండెల్లో నిరంతరం పల్లవించే వైప్లవ్యగీతం శ్రీశ్రీ.

ఆధునికత అంటే గుర్తొచ్చింది. తెలుగుసాహిత్యంలో ఆధునికత 1875 తరవాత తొంగి చూసిందంటారు. కందుకూరి కొంచెం నిజం... గురజాడ ఇంకొంచెం నిజం... శ్రీశ్రీ పెద్ద నిజం. తన పేరునే ఆధునికతకి కొలబద్దగా చేసుకున్న శ్రీశ్రీ నిజంగా గొప్పే. ప్రజల్లోకి వెళ్ళటమే శ్రీశ్రీ సాధించిన ఘనకార్యం. సామాన్యుణ్ని గిల్లితే వేమన పేరు చెబుతాడు. ఆపై శ్రీశ్రీ పేరు తలుస్తాడు. మానవుడే నా సందేశం అన్న కవి పలుకులు వృధాకావు. ప్రజాస్వామిక స్పృహకి ప్రబలనిదర్శనం శ్రీశ్రీ. 'దేశచరిత్రలు' ఒక్కటి చాలు.

డిలాన్ థామస్ 'ఏ గ్రీఫ్ ఎగో' అన్నట్టు శ్రీశ్రీ కూడా వ్యధా సర్పదష్టులు అనకుండా



- ఇవేమిటీ అపస్వరాలు!
- తెగింది తీగ
- అవేమిటారంగుల నీడలు?
- చావూ, బ్రదుకూ!
- ఎచటికి పోతావీ రాత్రి?
- అవతలిగట్టుకు


అవతలిగట్టు



బాధాసర్పదష్టుల్లారా అంటాడు. శ్మశానాల నిఘంటువుల్ని దాటి పోతాడు. రేడియో నాటికల్లో, చరమరాత్రి, కోనేటి రావు కతల్లో వ్యాకరణాల సంకెళు ్లు తెగ్గొడతాడు. రూపకాల్లో కవితాత్మక వచన శిల్పం ప్రదర్శిస్తాడు. ప్రభవ తరవాత ఛందస్సుల సర్పపరిష్వంగం నించీ బయటపడి 'వడి' అయ్యాడు సంప్రదాయం పట్ల కొంటెచూపుతో కొత్తందాల కందాలల్లాడు. సత్యాన్వేషణ దిశగా 'అనంత' మార్గం పట్టాడు.

శాస్త్రం, సాహిత్యం వేరంటాడు. శ్రీశ్రీని చూస్తే గురుత్వాకర్షణ శక్తిని నమ్మబుద్దేస్తుంది. ప్రియపాఠకుణ్ని కవిగా నిలబెట్టే పరుసవేది 'మహాప్రస్థానం' పాచికలు వేయటం శకుని విద్య... అదంతా చెడుకు! అక్షరాల గవ్వలను గువ్వలుగా ఎగరేయటం శ్రీశ్రీ కవిత్వం - ఇదంతా మంచికి!! శ్రీశ్రీ చేతిలో మంత్రదండం ఏదో ఉంది. అది తోటికవులకి కనబడలేదు కానీ పాఠకలోకానికి దర్శనమిచ్చింది. నెత్తిమీద ఇంద్రధనుస్సు, కాళ్లకింది సెలయేరు సృష్టించే కవులున్న చోట మనిషిని నిప్పురవ్వగా మండించటానికీ, అగ్నిపర్వతంగా రగిలించ టానికీ కవిత్వాన్ని జీవితంగా చేసుకుని 'చెలరేగిన అక్షరం 'శ్రీశ్రీ'. తెలుగు సంగీతభాష అన్న విషయం, పద్యం తరవాత శ్రీశ్రీ కవిత్వంలోనే అక్కరకొస్తుంది. ఒక్క ఊపులో ఆ తూగులో శ్రీశ్రీని చదూతుంటే ఎదెదలో మహాకవి మూర్తిమత్వానికి పూలదండ పరిమళిస్తుంది.

అన్నం తినటమెందుకంటే కడుపు నింపుకోటానికి.... అలాగే సాహిత్యాన్ని చదవట మెందుకంటే మనసు నిండటానికి! బుద్ధికి మృష్టాన్న భోజనాన్ని అందించిన శ్రీశ్రీ లాటి కవుల్ని తరచూ తలచుకుంటే మనసుకు రుచికరంగా ఉంటుంది. ముందు మనసుందన్న నిజం తెలుస్తుంది. దానికంటూ తిండీ తిప్పలూ అవసరమనీ, అది మరేదోకాదని సాహిత్యమేనన్న సత్యం బోధపడుతుంది. సాహిత్య పఠనాన్ని మూలకు నెట్టిన నేటి విద్య బాధపెడుతుంది. కవిత్వాన్ని ఆస్వాదించటం ఓ జీవకళ! కాదంటారా?


మరోప్రపంచం
పిలిచింది!



తెలుగు కవితా కన్నెని
జనాల్లోకి రాకుండా
జనానాల్లో నిర్బంధిస్తే
మహోర్వాటినంతా
మహాప్రస్థానం చేస్తూ
సూర్యుడి మీదో కాలు
తూరుపు మీదో కాలు
మోపాడు శ్రీశ్రీ

తెల్లజెండా కట్టిన
నెత్తురు కలం ఊపాడు శ్రీశ్రీ

కలాన్ని కాలానికేసి
సంధించాడు


శ్రీ కీ శ్రీ కీ మధ్య
ఒక సారస్వత మహాయుగాన్ని
బంధించాడు

అతడు జ్వరమొచ్చిన దేవుడు
కాల్తోన్న కాముడు
ఆప్యాయంగా మందిస్తారో
అసహ్యంగా నిందిస్తారో
మీ ఇష్టం

అతను
జ్వరమొచ్చిన దేవుడు
కాస్త జాగర్త
అన్నట్టు శ్రీశ్రీ అంటే
రెండు మెరుస్తోన్న కొడవళ్లు
రెండు చెమరుస్తోన్న కళ్లు ....

తనికెళ్ళ భరణి


తాజ మహల్ నిర్మాణానికి
రాళ్లెత్తిన కూలీలెవ్వరు?



కమ్మరి కొలిమి కుమ్మరిచక్రం
జాలరి పగ్గం సాలెల మగ్గం
శరీరకష్టం స్ఫురింపజేసే
గొడ్డలి రంపం కొడవలి నాగలి
సహస్ర వృత్తుల సమస్త చిహ్నాల్
నా వినుతించే
నా విరుతించే
నా వినిపించే నవీనగీతికి
నా విరచించే నవీనరీతికి
భావం
భాగ్యం
ప్రాణం
ప్రణవం

ప్రతిజ్ఞ




అందరం కలిసి చేసిన ఈ
అందమైన వస్తు సముదాయం అంతా
ఎక్కడో ఒక్కడే వచ్చి
ఎత్తుకు పోతూ ఉంటే చూచి,
"అన్యాయం, అన్యాయం" అని మేమంటే
'అనుభవించాలి మీ కర్మం' అంటారు

పొద్దుపొడిచి పొద్దుగడిచేదాకా
ఎద్దుల్లాగు పనిచేసే మమ్మల్ని
మొద్దుల్నీ, మొరటుల్నీ చేసి
ముద్దకి కూడా దూరం చేశాడు
"ఘోరం ఇది. దారుణం ఇ"దంటే -
"ఆచారం! అడుగుదాటరా"దంటాడు.

వాడు

THALASSEMIA
&
SICKLE CELL SOCIETY

STRIVE FOR PREVENTION



You too can share and support Thalassemia & Sickle Cell Society and make difference to the lives of thalassemia children.

Visit us on the web at **www.tscs.in** to know more about these disorders,our efforts and initiatives.

Be a regular blood donor.

Donate to society for setting up blood bank facilities.

Facilities Available

- 20 bedded transfusion facilities with back up of infusion pumps and monitor particularly small children.
- Diagnostic facilities for all inherited blood disorders.
- Supported by dedicated and experienced staff.
- Regular periodic check up for multi transfused patients by cardiologists, endocrinologists,
- Regular screening programmes for Hepatitis-B and C, HIV, Serum.Ferritin, calcium, phosphorus and comprehensive endocrine checkups.
- Counseling for family screening. Prenatal tests and prevention.
- Providing all necessary simple and specific drugs like Iron chelators at subsidized prices.
- Organizing programmes for public awareness.

Thalassemia & Sickle Cell Society
Vuppala Venkaiah Memorial Blood Bank

Door No. 22-8-496 to 501, 1st & 2nd Floor, Chatta Bazar X Road, Near City Civil Court, Purani Haveli, Hyderabad - 500 002, Ph. 24403783, 24520159, www.tscs.in, e-mail: tscsbb@gmail.com
Licence No. 01/HD/AP/2010/BB/G

STRIVE FOR PREVENTION

edited, printed and published by: Visweswara Rao # 28-10-26/1, Arundel pet, Vijayawada-2
Printed by him at: Sri Sri Printers, Arundel pet, Vijayawada-2

విడి ప్రతి రు. 10/-

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	KLVA101M220
పుస్తకం పేరు	కమ్యూనిజం
తారీఖు	08 February 2025
ముందు అట్ట	yes
వెనుక అట్ట	yes
మొత్తం పేజీలు	49
పెద్ద సైజు పేజీలు	no
ఖాళీ పేజీలు	no
లేని పేజీలు	no
తయారు చేసినది	Bhanu
పేజీలు విడదీసినది	Bhanu
స్కాన్ చేసినది	naveena
పరీక్ష చేసినది	sireesha
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	good